శనివారం
05-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 105
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇరాన్‌పై అణుదాడికి ఒప్పుకోలేదు: బైడెన్

వాషింగ్టన్: ఇరాన్‌కు చెందిన అణు స్థావరాలపై దాడి చేస్తామంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పగా తాము ఒప్పుకోలేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. అయితే పరిమిత స్థాయిలో దాడులకు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరిపే అంశం పరిశీలనలో ఉన్నదన్నారు. ఇరాన్ క్షిపణి దాడికి ఇజ్రాయిల్ ప్రతీకారం తీర్చుకుంటుందని అనుకోను కానీ అణు కేంద్రాలపై దాడికి మాత్రం అనుమతి ఇవ్వబోమని బైడెన్ వెల్లడించారు. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయిల్ దాడి చేయడానికి పరిమిత అనుమతులు ఇవ్వాలనే ఆలోచన ఉన్నదన్నారు.

విమర్శిస్తే జర్నలిస్టులపై కేసులా : సుప్రీం

న్యూఢిల్లీ: పాత్రికేయులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంలో పాలకులు విఫలమవుతున్నారని సుప్రీంకోర్టు విమర్శించింది. ప్రభుత్వాన్ని విమర్శిస్తే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెడుతుండటాన్ని ఆక్షేపించింది. అందుకు వీల్లేదని శుక్రవారం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇదే అంశమై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చీవాట్లుపెట్టింది. నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేసింది. అప్పటివరకు పిటిషనర్‌పై కఠిన చర్యలు

- మిగతా 2 లో

హర్యానా ఎన్నికల పోలింగ్ నేడు

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం జరగనుంది. ఒకే విడతలో జరగనున్న ఈ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సర్వం సిద్ధం చేసింది. ఈ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికార బీజేపీ సైతం మళ్లీ అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తుంది. ఈసారి బీజేపీని పక్కకు నెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారం హస్తగతం

- మిగతా 2 లో

సచివాలయం నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు

ముంబై: ఆదివాసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సొంత వర్గం ఎమ్మెల్యేలే శుక్రవారం సచివాలయంలో ఆందోళన చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ సహా కొందరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ సచివాలయం మూడో అంతస్తు నుంచి కిందికి దూకారు. అయితే, అక్కడ సేఫ్టీ నెట్ ఉండటంతో వీరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ పరిణామాలతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధన్‌గఢ్ కమ్యూనిటీని ఎస్టీ కేటగిరీలో చేర్చాలన్న డిమాండ్‌ను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇది చదవండి సార్! సర్వసత్తాక లౌకికరాజ్యం అంటే ఏమిటో తెలుస్తుంది!

దండకారణ్యంలో కాల్పుల మోత

బస్తర్‌లో భారీ ఎన్‌కౌంటర్

40 మంది మావోయిస్టుల హతం

దంతెవాడ: దండకారణ్యం కాల్పులతో దద్దరిల్లింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య భీకరపోరు జరిగింది. పరస్పర కాల్పులతో దండకారణ్యం నెత్తుటిమయమైంది. చత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మరోమారు కాల్పులు వినిపించాయి. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం జరిగిన భీకర ఎన్‌కౌంటరులో 40 మంది మావోయిస్టులు మృతి చెందారు. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్‌మడ్ దండకారణ్యంలోని తుల్‌తులి, నెందూర్ గ్రామాల మధ్య ఎన్‌కౌంటర్ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైంది. సుదీర్ఘంగా సాయంత్రం వరకు ఎన్‌కౌంటర్ కొనసాగింది. ఆటోమేటిక్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కలిసి ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారం ఉండటంతో ఆ ప్రాంతానికి భద్రతా సిబ్బంది వెళ్లినట్లు చెప్పారు. ఎదురు కాల్పుల్లో భద్రతా సిబ్బందిలో ఎవరికీ గాయాలు కాలేదని, అంతా సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. తుపాకీల మోత ఆగిన తర్వాత మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు మరొక అధికారి చెప్పారు. మొత్తం ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నట్లు తెలిపారు. ఏకే 47 రైఫిల్, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్‌ఎల్‌ఆర్)తో పాటు మరికొన్ని ఆయుధాలను ఎన్‌కౌంటర్ స్థలి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది బస్తర్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 171 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

తిరుపతి లడ్డూ వివాదంపై
స్వతంత్ర సిట్‌తో దర్యాప్తు

- ఐదుగురితో కమిటీ... సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణ
- సీబీఐ, ఏపీ నుంచి ఇద్దరి చొప్పున, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు
- కోట్లాది మంది భక్తుల విశ్వాసం దృష్ట్యా నిర్ణయం
- సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ
- తీర్పును స్వాగతించిన రాజకీయపార్టీలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరపున ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. స్వతంత్ర సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపింది. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపారు. 'మొత్తం అంశాన్ని పరిశీలించాను. ఇది భక్తుల మనోభావాలకు చెందిన విషయం. దర్యాప్తు కొనసాగాలని కోరుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. అయితే స్వతంత్ర విచారణ కోరుకుంటున్నారు కాబట్టి... సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది' అని చెప్పారు.

తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందనే ఆరోపణలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి, టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్‌సంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేశ్ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం... ఏపీ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే (సిట్) కొనసాగించాలా? లేదంటే ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలా అన్న అంశంపై కేంద్రం అభిప్రాయం చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచిస్తూ విచారణను వాయిదా వేసింది. పిటిషనర్లలో ఒకరైన వైవీ

- మిగతా 2 లో

రంగంలోకి సీబీఐ

ఏపీలోకి అనుమతిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు
తాజాగా లడ్డూ కల్తీ వివాదంతో తెరపైకి...
అధికారుల్లో కలవరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చాలా రోజుల తర్వాత ఏపీలోకి సీబీఐ మళ్లీ ప్రవేశించనుంది. తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై ఐదుగురితో స్వతంత్ర సిట్‌కు సుప్రీం కోర్టు ఆదేశించడంతో సీబీఐ రాష్ట్రంలోకి అడుగుపెట్టడం అనివార్యమైంది. అనేక వివాదాల అనంతరం ఈ కేసు సీబీఐ చెంతకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ రద్దయిపోయింది. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వాడారంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దానిపై అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ నేతలు పరస్పరం విమర్శలకు దిగారు. ఈ వివాదం కాస్తా రాజకీయ రంగు పులుముకునే పరిస్థితికి దారితీసింది. దీనిపై దర్యాప్తునకు చంద్రబాబు ప్రభుత్వం సిట్ వేయగా... దాన్ని వైసీపీ నేతలు వ్యతిరేకిస్తూ సుప్రీంను ఆశ్రయించారు. స్వతంత్ర్య సంస్థలతో విచారించాలని ప్రధాని మోదీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వైసీపీ అధినేత జగన్ లేఖలు రాశారు. తుదకు తిరుమలకు జగన్ వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆ సమయంలో అన్యమత వివాదం, డిక్లరేషన్ అంశాలను తెరపైకి తేవడంతో దాన్ని రద్దు చేసుకున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తిరుమలకు వెళ్లి ప్రాయశ్చిత దీక్షలు నిర్వహించారు. ఒక వైపు ఇదంతా జరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో సిట్ విచారణను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈలోగా సుప్రీం ఆదేశాలతో అది మరుగున పడి... కొత్తగా సీబీఐ నేతృత్వంలోని స్వతంత్ర సిట్ రంగంలోకి దిగనుంది. దీంతో సీబీఐ రాష్ట్రంలోకి ప్రవేశించాల్సిన పరిస్థితి ఎదురైంది. సీబీఐ రంగంలోకి దిగడంతో గత ప్రభుత్వ

- మిగతా 2 లో

విజయం సాధించే వరకూ ఉద్యమం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన వెనక్కి తీసుకోవాల్సిందే
సీపీఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల స్పష్టీకరణ

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకునే వరకు పోరాటం ఆగదని వక్తలు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబరు 1, 2, 3 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాల అధ్వర్యంలో నిరసన దీక్షలు జరిగాయన్నారు. విశాఖ ఉక్కుకు అనుకూలంగా మాట్లాడితే కేంద్ర ప్రభుత్వం ఎదురుదాడి చేయటం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ గురించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడితే... విశాఖ ఉక్కు అంశాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని కేంద్ర ఉక్కు శాఖమంత్రి వ్యాఖ్యానించడాన్ని రామకృష్ణ ఖండించారు. ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు గానీ, యాజమాన్యం గానీ ప్రైవేటీకరణ చేయాలనుకోలేదన్నారు. ఇది కేవలం

- మిగతా 2 లో

స్విగ్గీని బహిష్కరిస్తున్నాం...

ఏపీ హోటల్స్ అసోసియేషన్

విశాలాంధ్ర-విజయవాడ(లబ్బీపేట) : స్విగ్గీని ఈనెల 14 నుంచి బహిష్కరిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి.స్వామి తెలిపారు. శుక్రవారం నగరంలో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల క్రితం నుంచి నడుస్తున్న డెలివరీ యాప్‌లు స్విగ్గీ, జొమాటో ద్వారా రాష్ట్రంలోని రెస్టారెంట్లు, హోటళ్లు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. డెలివరీ యాప్ ద్వారా హోటల్‌లో కొనుగోలు చేసిన ఆహారాన్ని ఉచితంగా ఇళ్లకు డెలివరీ చేసిన స్విగ్గీ, జొమోటో వారు కాలక్రమేణా 20 నుంచి 30 శాతం హోటల్ నుంచి కమీషన్ తీసుకోవడం ప్రారంభించారని తెలిపారు. మరోవైపు, హోటళ్లు,

- మిగతా 2 లో

బీరుట్‌పై బాంబుల వర్షం ← 2లో → ఇజ్రాయిల్‌కు అస్తిత్వం ఉండదు: ఖమేనీ

బీరుట్‌పై బాంబుల వర్షం

హెజ్బుల్లా మరో కమాండర్ రషీద్ సకాఫీ హతం

అధినేత హాషీం లక్ష్యంగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు తీవ్రం

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించింది. హెజ్బుల్లా కొత్త అధినేత హాషీం సఫీయిద్దీన్ లక్ష్యంగానే వైమానిక దాడులను భీకరంగా జరిపింది. ఇదే క్రమంలో హెజ్బుల్లా మరో కమాండర్ రషీద్ సకాఫీని మట్టుబెట్టింది. ఈ మేరకు ఇజ్రాయిల్ సైనిక, మీడియా వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. లెబనాన్ అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు జనసందోహ ప్రదేశాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు జరిపిన దాడులతో బీరుట్ దద్దరిల్లిపోయింది. భవనాలు ఊగిపోగా ... కార్ల అలారాల మోతతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. ఇప్పటివరకు ఇంత తీవ్రస్థాయిలో ఇజ్రాయిల్ దాడులు జరగలేదని, వరుసగా 11 సార్లు వైమానిక దాడులు జరిగాయని హెజ్బుల్లా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. హెజ్బుల్లా నూతన అధినేత లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది. హెజ్బుల్లా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అధిపతి మహమ్మద్ రషీద్ సకాఫీని మట్టుపెట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం తాజాగా ప్రకటించింది. ఇంటెలిజెన్స్ ఆధారంగా గురువారం జరిపిన దాడుల్లో ఆయనను హతమార్చినట్లు పేర్కొంది.

సిరియాను లెబనాన్‌తో కలిపే మస్నా సరిహద్దు మార్గాన్ని ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. వైమానిక దాడులతో రోడ్డుకు రెండు వైపులా రెండు పెద్ద గుంటలు పడిన దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు వీలు లేకపోగా... జనం కాలినడకన వెళుతున్నారు. ఇజ్రాయిల్ వైమానిక దాడుల నుంచి తప్పించుకునేందుకు లెబనాన్ నుంచి సుమారు మూడు లక్షల మంది గత పది రోజుల్లో ఇదే మార్గంలో తరలిపోయారు. వీరిలో సిరియన్లు అధికం.

బీరుట్‌కు ఇరాన్ మంత్రి

ఇజ్రాయిల్, హెజ్బుల్లా మధ్య పోరుపై లెబనాన్ అధికారులతో చర్చించేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ బీరుట్ చేరుకున్నారు.

వెస్ట్‌బ్యాంక్‌పై దాడుల్లో 18 మంది మృతి

వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 18 మంది మృత్యువాత పడ్డారు. తుల్కరేం శరణార్థి శిబిరంపై ఈ దాడి జరిగింది.

37 ఆరోగ్య కేంద్రాల మూత

ఇజ్రాయిల్ భీకర దాడుల కారణంగా లెబనాన్‌లో 37 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మూతపడ్డాయి. ఇందులో తొమ్మిది ఐరాసకు చెందినవి ఉన్నాయి. ఇజ్రాయిల్ దురాక్రమణ కారణంగా లెబనాన్ నుంచి పది లక్షల మంది తరలిపోగా, వారిలో 11,600 మంది గర్భిణులు ఉన్నట్లు ఐరాస తెలిపింది.

మరిన్ని ఆశ్చర్యకర ఘటనలు చూస్తారు: ఇజ్రాయిల్ రక్షణ మంత్రి

సాయుధ దళం నామ రూపాలు లేకుండా చేసేంత వరకు లెబనాన్‌లో తమ దాడులు ఆగబోవని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంత్ వెల్లడించారు. ముస్ముందు మరిన్ని ఆశ్చర్యకర ఘటనలు చోటుచేసుకోనున్నట్లు తెలిపారు.

లయన్స్ గేట్ వద్ద పలస్తీనియన్లకు వేధింపులు

జెరూసలేంలోని ఓల్డ్ సిటీలోగల లయన్స్ గేట్ వద్ద ఇజ్రాయిల్ దళాల చేతిలో పలస్తీనియన్లు వేధింపులకు గురయ్యారు. అల్ అక్సా మసీదులోకి ముస్లిలను వెళ్లనివ్వకుండా, ప్రార్థనలు నిర్వహించకుండా ఇజ్రాయిల్ సైనికులు అడ్డుకున్నారు. అయితే కొందరు కొందరు బలవంతంగా లోపలికి వెళ్లగలిగారు.

ఇజ్రాయిల్‌కు అస్తిత్వతం ఉండదు: ఖమేనీ

టెహ్రాన్: హమాస్, హెజ్బుల్లాతో ఇజ్రాయిల్ ఎక్కువ కాలం తట్టుకోలేదని, శత్రుదేశాన్ని చిత్తు చేస్తామని ఇరాన్ అధినేత ఆయాతుల్లా అలీ ఖమేని ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కలిసి రావాలని పలస్తీనా, లెబనాన్‌తో పాటు ఇస్లామిక్ దేశాలకు పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలోని భూములు, వనరులను స్వాధీనం చేసుకొనేందుకు అమెరికా ఇజ్రాయిల్ అనే అస్త్రాన్ని ప్రయోగించిందని ఖమేనీ వ్యాఖ్యానించారు. అమెరికా మద్దతు కారణంగానే ఇజ్రాయిల్ ఇప్పటివరకు నిలబడగలిగిందని, దానికి ఎలాంటి ఆధారం లేదని, అది అస్థిమైనదని, ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని అన్నారు. ఇజ్రాయిల్-గాజా యుద్ధానికి ఏడాది పూర్తి అయ్యేందుకు కేవలం మూడు రోజులు ఉండటం, ఇజ్రాయిల్ కీలక మౌలిక వసతులపై 180 క్షిపణులతో ఇరాన్ దాడి చేసి మూడు రోజులు తర్వాత ఖమేనీ చేసిన ఈ ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మసీదులో లక్షల మంది అభిమానులనుద్దేశించి శుక్రవారం ఖమేని మాట్లాడారు. హెజ్బుల్లా మాజీ అధినేత నస్రల్లా సంస్మరణగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమేనీ దాదాపు ఐదేళ్ల తర్వాత ఉపన్యసించారు. ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడులను సమర్థించారు. ప్రజల సేవలో భాగంగా వాటిని అభివర్ణించారు. తన ప్రాణానికి ముప్పు ఉన్నప్పటికీ ప్రజల మధ్యకు వచ్చిన ఖమేనీ శత్రువును ఓడిస్తామని సంకల్పించారు. ఇజ్రాయిల్ హిట్ లిస్ట్‌లో ఖమేనీ ఉండటం విదితమే. హెజ్బుల్లా మాజీ అధినేత సయ్యద్ హసన్ నస్రల్లా మన మధ్య లేరు కానీ ఆయన చూపిన మార్గం, అందించిన స్ఫూర్తి మనతో ఎప్పటికీ ఉంటుందని ఖమేనీ అన్నారు. ఆయన బలిదానం ఊరికే పోదన్నారు. మన విశ్వాసాన్ని బలపర్చుకొని మరింత ధృఢంగా శతువును ఎదుర్కొవాలంటూ ఖమేనీ పిలుపునిచ్చారు. 'శత్రువు ప్రణాళికలు భగ్నం చేస్తాం. కలిసి కట్టుగా పోరాడి ఓడిద్దాం అని ఆయన అభిమానులను ఉత్తేజపరిచారు. నస్రల్లా నాయకత్వంలో హెజ్బుల్లా అంచెలంచెలుగా పెరిగింద'ని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో లెబనాన్‌కు అండగా నిలవడం ముస్లింల బాధ్యతన్నారు. అల్ అక్సా మసీదు కోసం పోరు, లెబనాన్ ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. అక్టోబరు7న ఇజ్రాయిల్‌పై దాడులు జరగడం సమర్థనీయమేనని ఖమేనీ అన్నారు. దురాక్రమణను ఎదిరించడం, ఆత్మరక్షణ కోసం పోరాడే హక్కును పలస్తీనియన్లు, లెబనాన్ ప్రజలకు ఉన్నదని, దీనిని ఏ అంతర్జాతీయ చట్టం కాదనలేదని నొక్కిచెప్పారు. ఖేమని చివరిగా 2020 జనవరిలో శుక్రవారం ఉపన్యాసమిచ్చారు. రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఖాసిం సులేమానీని ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరంపై జరిపిన క్షిపణి దాడిలో హతమార్చిన తర్వాత ఆ కార్యక్రమం జరిగింది. కాగా, హెజ్బుల్లా, హమాస్‌కు ఇరాన్ సంపూర్ణ మద్దతిస్తోంది.

రంగంలోకి సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత ప్రభుత్వ అధికారులు ఉలిక్కిపాటుకు గురవుతున్నారు. ఒక్కసారి సీబీఐ విచారణ ప్రారంభమైతే... అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగిస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గత చైర్మన్లు, పాలక వర్గాలనూ విచారించే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ప్రభుత్వంలో నెయ్యి ట్యాంకర్లు వెనక్కి పంపినట్లు ఈవో చెబుతుండగా, లేదు కల్తీ జరిగిందంటూ చంద్రబాబు చేసిన పరస్పర వ్యాఖ్యల పైనా సీబీఐ విచారణ దృష్టికి వస్తాయి.

సీబీఐకి ముందే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల సీబీఐకి సాధారణ సమ్మతిని పొడిగిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. జులై ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2018 నవంబరులో ఎన్‌డీఏ నుంచి వైదొలిగిన తర్వాత రాష్ట్రంలో కేసుల దర్యాప్తునకు సీబీఐకి ఇచ్చిన సమ్మతిని గత టీడీపీ ప్రభుత్వం (2014-19) ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయం అప్పట్లో సంచలనంగా మారింది. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. అయినప్పటికీ వివేకా కేసుల్లో కేంద్రంపై ఒత్తిడి పెంచి... సీబీఐ దర్యాప్తు సక్రమంగా కొనసాగించలేదన్న విమర్శలు వచ్చాయి. దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీఎస్‌పీఈ) చట్టం-1946 (1946 చట్టం-25) లోని సెక్షన్ 6 ప్రకారం... ఈ చట్టంలోని సభ్యుల అధికారాలు, అధికార పరిధిని పొడిగించడానికి దీని ద్వారా దాని సమ్మతిని ప్రభుత్వం తెలియజేసింది. ఈ ఉత్తర్వుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన కేసుల్లో ముందస్తు రాత పూర్వక అనుమతితో మినహా సీబీఐ అలాంటి దర్యాప్తును కొనసాగించదు. లడ్డూ వివాదం కేసులో రాష్ట్ర స్థాయి అధికారులను విచారించాల్సి వస్తే... ప్రభుత్వం నుంచి ముందస్తుగా రాత పూర్వక అనుమతిని సీబీఐ అధికారులు అనుమతి పొందాల్సి ఉంది. తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ వేయడాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు స్వాగతిస్తున్నాయి. సీఎం చంద్రబాబు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఏకంగా మీడియా సమావేశాన్ని నిర్వహించి దేవుడితో ఆటలాడవద్దంటూ చంద్రబాబుకు హితవు పలికారు.

ఉమ్మడి దర్యాప్తుతో నిగ్గుతేలేనా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడిన ఉమ్మడి దర్యాప్తు సంస్థలతో లడ్డూ కల్తీ వ్యవహారం నిగ్గు తేలుతుందా?, లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు అనేక రాష్ట్రాల్లో ఇదే తరహాగా కేసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో ఉమ్మడిగా సంస్థలు దర్యాప్తు చేశాయి. హైదరాబాద్ జంట పేలుళ్ల కేసును ఎన్‌ఐఏతో పాటు తెలంగాణ పోలీసులు విచారించారు. విజయ్ మాల్యా బ్యాంకులను మోసగించిన కేసును సీబీఐ, ఈడీ, రాష్ట్ర పోలీసు సంస్థలు దర్యాప్తు చేశాయి. నీరవ్ మోదీ కేసులో సీబీఐ, ఈడీ, రాష్ట్ర పోలీసులు విచారించారు. తెల్గీ స్టాంప్ పేపర్ కేసును సీబీఐ, రాష్ట్ర పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. 2జీ స్పెక్ట్రమ్ కేసును సీబీఐ, రాష్ట్ర పోలీసులు, బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంలో సీబీఐ, రాష్ట్ర పోలీసులు, ముంబై ఉగ్ర దాడి కేసును ఎన్‌ఐఏ, మహారాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పఠాన్‌కోట్ ఉగ్రవాది కేసును ఎన్‌ఐఏ, పంజాబ్ పోలీసులకు అప్పగించారు. బుర్ద్వాన్ పేలుళ్ల కేసును ఎన్‌ఐఏతో కలిసి పశ్చిమ బెంగాల్ పోలీసులు విచారించారు. ఇదే తరహాగా ఇప్పుడు లడ్డూ వివాదం కేసు దర్యాప్తు పురోగతి ఎంతవరకు ముందుకు వెళుతుందనేది చూడాలి.

విజయం సాధించే వరకూ ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

మోదీ ప్రభుత్వ నిర్ణయమన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటీకరించాలనే ఆలోచనలో భాగంగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ సర్కార్ ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమలో రెండు బ్లాస్ట్ ఫర్నేసులను ఆపేసిందని, బొగ్గు సరఫరా నిలిపేసిందన్నారు. ఒప్పంద కార్మికులను తొలగించి, శాశ్వత ఉద్యోగులను బదిలీ చేసి స్వతహాగా ఫ్యాక్టరీ మూతపడేలా చేస్తుందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీని అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కి అప్పు ఇస్తే... దానిని లాభాల్లోకి తీసుకువచ్చి అప్పు తీర్చే సామర్థ్యం కార్మికులకు ఉందన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపడానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ పదేళ్లు మోసం చేసినా వైసీపీ, టీడీపీ ఎంపీలు కేంద్రం తీసుకువచ్చిన ప్రతి బిల్లుకు మద్దతు ఇచ్చారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు లాభాల్లో ఉందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నష్టాల్లోకి వచ్చిందన్నారు. బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. ఇందిరాగాంధీ జాతికి అంకితం చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు లేకపోవటం వల్ల ముడిసరుకు కొనుగోలుకే జీఎస్టీ ద్వారా రూ.2 వేల కోట్ల పన్ను భారం పడుతుందన్నారు. కార్మికులు పని చేయకపోవటం వల్ల ఫ్యాక్టరీకి నష్టాలు రాలేదని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నిర్ణయాలతోనే నష్టం వస్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సారథ్యంలో అఖిలపక్ష నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించేలా కేంద్రంపై ఒత్తిడి చేయమని కోరాలని సూచించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ విశాఖ పర్యటన తరువాత 4,200 మంది ఒప్పంద కార్మికులను తొలగించారన్నారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు వ్యతిరేకించటంతో ఉద్యోగులను తొలగించటం లేదని, కార్మికశాఖ వద్ద నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మనుగడకు చంద్రబాబు కీలకంగా ఉన్నందున మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించపోతే ఎన్డీఏతో తెగతెంపులు చేసుకునేలా విద్యార్థి, కార్మిక, రైతు, మహిళా సంఘాలు ఉద్యమించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకపోవటం ప్రధాన సమస్య అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం విద్యార్థిలోకం ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థి సంఘాలను కలిసి ఉద్యమంలోకి తీసుకురావాలన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములు రాష్ట్రపతి పేరుతో ఉన్నాయని చెప్పారు. ఆ భూములను స్టీల్ పేరుకు మార్చితే వాటిని తాకట్టుపెట్టి స్టీల్‌ప్లాంట్‌ని నడిపించుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.పోలారి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సమస్యను ఉద్యోగుల సమస్యగా కాకుండా ప్రజాఉద్యమంగా మార్చాలన్నారు. ఎంసీపీఐ నాయకులు సయ్యద్ సలీం, వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల, ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, చేతివృత్తిదారుల సంఘం నాయకులు భాస్కరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మహంకాళి సుబ్బారావు, ఒడిశా మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర నాయకులు ఎం.ప్రసాద్‌బాబు, సీపీఐ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు తదితరులు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారు. అతిథులకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి స్వాగతం పలికారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు కొలనుకొండ శివాజి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు పి.పద్మ, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శిస్తే జర్నలిస్టులపై కేసులా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునేందుకు వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని కీలక పదవుల్లో ఓ కులానికి చెందిన వారినే నియమిస్తున్నారంటూ ఎక్స్‌లో వ్యాఖ్యానించిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయపై క్రిమినల్ కేసు నమోదు చేసిన వ్యవహారాన్ని సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. ప్రభుత్వాన్ని విమర్శించినందుకు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు వీల్లేదని, వారి హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తోందని జస్టిస్ రిషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. 'ప్రజాస్వామ్య దేశాల్లో భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) కింద జర్నలిస్టుల హక్కులకు రక్షణ కల్పించబడింది. జర్నలిస్టుల రాతలు ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నాయంటూ వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం ఆమోదయోగ్యం కాదు' అని ధర్మాసనం తెలిపింది. సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు ఆధారంగా తనపై లక్నోలో నమోదైన ఎఫ్ఐఆర్ చెల్లుతుందా అంటూ ఉపాధ్యాయ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున న్యాయవాది అనూప్ ప్రకాశ్ అవస్తీ వాదనలు వినిపిస్తూ ఎఫ్ఐఆర్ చూస్తే అసలు నేరమేమిటో తెలియడం లేదన్నారు. ఈ వ్యవహారంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసి నాలుగు వారాల్లోగా వివరణ కోరింది. ఈలోగా పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది.

స్వతంత్ర సిట్‌తో దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

సుబ్బారెడ్డి తనపై విజిలెన్స్ విచారణ అంశాన్ని దాచిపెట్టారని, విజిలెన్స్ విభాగం నుంచి వచ్చిన నోటీసులు, దానిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని సుప్రీంకోర్టుకు ఆయన చెప్పలేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లగా, ఆగ్రహం వ్యక్తం చేస్తూ భక్తుల మనోభావాలతో కూడిన వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది. కోర్టులను రాజకీయ వేదికలుగా వినియోగించవద్దని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటుకు ధర్మాసనం విముఖత వ్యక్తం చేస్తూ ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: సీఎం చంద్రబాబు

తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. సుప్రీం ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై సీబీఐ, ఏపీ పోలీస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సభ్యులతో సిట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. 'సత్యమేవ జయతే', 'ఓం నమో వేంకటేశాయ' అని సీఎం పేర్కొన్నారు.

సత్యం వెలుగుచూస్తుంది: పవన్ కళ్యాణ్

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారన్న అంశంపై స్వతంత్ర సిట్‌తో దర్యాప్తునకు సుప్రీం ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సిట్‌తో సత్యం వెలుగుచూస్తుందన్నారు. తప్పుడు నిర్ణయాలకు, అపవిత్ర చర్యలకు కారకులైన వారిని నిబంధనల ప్రకారం బాధ్యులను చేస్తామని పవన్ హెచ్చరించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి: జగన్

చంద్రబాబుకు దేవుడంటే భక్తి ఉంటే సుప్రీంతీర్పుతోనైనా ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబుకు భయం, భక్తి రెండూ లేవు. ఆయనకు భయం, భక్తి ఉంటే... ఇప్పటికైనా పశ్చాత్తాపం రావాలన్నారు. ఇప్పటికీ టీడీపీ ట్విట్టర్‌లో ఆయన అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కోర్టులు వారిని తప్పుబడితే సోషల్ మీడియాలో మాపై తప్పుడు ప్రచారానికి తెరలేపారు. సుప్రీంకోర్టు అక్షింతలు వేసినా చంద్రబాబు తీరు మారలేదని జగన్ విమర్శించారు.

హర్షణీయం: రామకృష్ణ

తిరుపతి లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన సిట్ దర్యాప్తునకు ఆదేశించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్వాగతించారు. సిట్ బృందం సకాలంలో విచారణ పూర్తి చేసి... దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వాగతిస్తున్నాం: శ్రీనివాసరావు

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డులో కల్తీపై విచారణకు ఉన్నతస్థాయి విచారణ కమిటీకి సుప్రీం ఆదేశించడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేశారు. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ న్యాయవాది కేంద్రం జోక్యాన్ని కోరడం... తిరుమలను తన పరిధిలోకి తీసుకుని పెత్తనం చేయాలనుకుంటున్నట్లు స్పష్టమవుతోందన్నారు.

స్వతంత్ర సిట్ దర్యాప్తును స్వాగతిస్తున్నాం: షర్మిల

లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు నియమించిన ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ దర్యాప్తును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. కల్తీ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి తాము సీబీఐచే దర్యాప్తు చేయాలని కోరామని, ఈ వివాదాన్ని రాజకీయం చేయడం సరికాదని చెప్పామని గుర్తు చేశారు. దీనిపై గవర్నర్‌ను కూడా కలిసి సీబీఐచే విచారణ జరిపించాలని కోరినట్లు వెల్లడించారు.

న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నాం: వైవీ సుబ్బారెడ్డి

లడ్డూ విషయంలో గత ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయని మాట్లాడారని, సీబీఐ విచారణతో న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నామని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. లడ్డూ విషయంలో కల్తీ ఆరోపణలు నిజమైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని చెప్పామన్నారు. తన హయాంలో ఏఆర్ కంపెనీ నుంచి ఎప్పుడూ నెయ్యి సరఫరా జరగలేదని స్పష్టం చేశారు.

స్విగ్గీని బహిష్కరిస్తున్నాం...

(మొదటిపేజీ తరువాయి)

రెస్టారెంట్ల యాజమాన్యాలకు తెలియకుండా ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే ఆఫర్లను వీరే స్వయంగా ప్రకటించి రెస్టారెంట్ యాజమాన్యాల ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. వినియోగదారులు ఇచ్చిన ఆర్డర్లను తయారు చేసిన తర్వాత ఆర్డర్ రద్దు చేయడం ద్వారా హోటళ్ల యాజమాన్యాలు నష్టపోతున్నాయని చెప్పారు. బిర్యానీ రూ.49, బిర్యానీ రూ.99, బిర్యానీ రూ.129 అంటూ ఆఫర్లు పెట్టి గిట్టుబాటు ధర కూడా కల్పించకుండా యాజమాన్యాలు దివాలా తీసే విధంగా ఆఫర్లు ప్రకటిస్తున్నారని తెలిపారు. స్విగ్గీ ఒకపక్క తక్కువ ధరలతో హోటళ్ల యజమాన్యాలను నష్టపరుస్తూ, అధిక కమీషన్లు వసూలు చేస్తోందని, అది చాలదన్నట్లు నిబంధనలకు విరుద్ధంగా జీఎస్టీ వసూలు చేయడం దారుణం అన్నారు. ఆర్డర్లపై సరఫరా చేసిన పార్శిళ్ల నగదును హోటళ్ల యాజమాన్యాలకు చెల్లించడానికి దాదాపు 12 రోజులు గడువు తీసుకోవడంతో చిన్న చిన్న పెట్టుబడులతో నడిచే హోటళ్లు దివాలా తీసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయాలన్నింటిపై స్విగ్గీ, జొమాటోతో ఆగస్టు 12, 27 తేదీలలో, అలాగే సెప్టెంబరు 21న మొత్తంగా మూడు దఫాలుగా చర్చలు జరిపామన్నారు. తమ ప్రతిపాదనలకు జొమాటో సానుకూలంగా స్పందించిందని, స్విగ్గీ మాత్రం తిరస్కరించిందని వివరించారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ స్విగ్గీని అక్టోబరు 14 నుంచి బహిష్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. విజయవాడ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.రమణ, విశాఖపట్నం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వసంత కృష్ణ, విజయ నగరం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, తిరుపతి హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంజి, ప్రకాశం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండయ్య, అనంతపురం హోటల్స్ అసోసియే షన్ అధ్యక్షులు రమణ, గుంటూరు హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

హర్యానా ఎన్నికల పోలింగ్ నేడు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, మధ్యలో ఆమ్ ఆద్మీ పార్టీ ఏమి చేస్తుందనేది సందేహాస్పదంగా మారింది. ఇప్పటికే దిల్లీ, పంజాబ్‌లో పాగా వేసిన కేజ్రీవాల్ పార్టీ హర్యానాపై దృష్టి కేంద్రీకరించింది. ఈ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి విడుదలైన ఆయన... ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ నిమగ్నమయ్యారు. మరోవైపు హర్యానాలో మొత్తం 10 లోక్‌సభ స్థానాలున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేశాయి. తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను బరిలో నిలుపగా... ఆప్ కురుక్షేత్రలోనే తన అభ్యర్థిని పోటీకి నిలిపింది. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ చెరి ఐదు స్థానాలు గెలుచుకున్నాయి. ఒకే ఒక్క స్థానంలో పోటీ చేసిన ఆప్ అభ్యర్థి మాత్రం బీజేపీ అభ్యర్థి నవీన్ జిందాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో ఆ ఎన్నికల్లో ఆప్ తన సత్తా చాటలేకపోయింది. అందుకే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌తో పొత్తుపై కాంగ్రెస్ పార్టీ మీనమేషాలు లెక్కించింది. హర్యానాలో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటరు పట్టం కడితే... మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు ఆ రాష్ట్ర ఓటరు క్లీన్‌చిట్ ఇచ్చినట్లే అవుతుందనే చర్చ జరుగుతోంది. చివరికి ఓటరు ఎవరిని వరిస్తాడో చూడాల్సిందే.

అమరావతికి కొత్త రైల్వే లైను

జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాజధాని అమరావతి కోసం ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు కొత్త రైల్వే లైన్ కోసం సర్వే పూర్తయిందని, రైల్వే బోర్డు ఆమోదం తెలిపి, నిధులు కేటాయించగానే పనులు ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజనల్ పరిధిలోని పార్లమెంటు సభ్యులతో శుక్రవారం స్థానిక సత్యనారాయణపురం వద్ద ఉన్న ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీసీ) లో సమావేశం జరిగింది. దీనికి ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర సహాయ మంత్రులు, 15 మంది పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్, గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ, గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.విజయ కుమార్, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్, దక్షిణ మధ్య రైల్వే వివిధ శాఖలకు ప్రధానాధిపతులు, ఇతర సీనియర్ రైల్వే అధికారులు సమావేశానికి హాజరయ్యారు. జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పనితీరుకు సంబంధించి... ప్రయాణీకుల సేవలు, సరుకు రవాణా, గూడ్స్ షెడ్‌ల అభివృద్ధి, వివిధ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు, డిజిటల్ కార్యక్రమాలు, నూతన రైళ్ల ప్రారంభంతో మెరుగైన అనుసంధానం, ప్రత్యేక రైళ్ల నిర్వహణ, అదనపు కోచ్‌ల పెంపుదల, స్టేషన్లు, రైళ్లలో పరిశుభ్రత, పర్యావరణ హిత హరిత కార్యక్రమాలు తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏపీ పరిధిలో 56 రైల్వే స్టేషన్లను రూ.2,593 కోట్ల అంచనా వ్యయంతో అమృత్ స్టేషన్‌లుగా పునరాభివృద్ధి చేసేందుకు గుర్తించినట్లు తెలిపారు.

సచివాలయం నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ వర్గానికి చెందిన ఎన్సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్‌తో పాటు బీజేపీ ఎంపీ హేమంత్ సావ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమాటే, హిరామన్ ఖోస్కర్, రాజేష్ పాటిల్ నిరసన చేపట్టారు. సచివాలయంలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. మొదటి అంతస్తు వద్ద ఏర్పాటు చేసిన సేఫ్టీ నెట్‌లో పడ్డారు. పోలీసులు వెంటనే వారిని రక్షించారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. అనంతరం వారంతా సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ధన్‌గఢ్ కమ్యూనిటీ సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రకటించడంలో తమకు ఎలాంటి సమస్యలు లేవని... అయితే వారిని ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఝిర్వాల్ తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు సచివాలయం వద్దే ధర్నా కొనసాగిస్తామన్నారు. అయితే మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిండే వారితో సమావేశం కావడంతో ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

లిడ్ క్యాప్‌కు మంచి రోజులు: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో లిడ్ క్యాప్‌కి మంచి రోజులు వచ్చాయని, ఈ సంస్థ ద్వారా అనేక మందికి స్వయం ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. తాడేపల్లిలోని లిడ్ క్యాప్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యాలరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మంత్రి డోలా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో లిడ్ క్యాప్ నిర్వీర్యమైందన్నారు.

ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారం

- యువజన సదస్సుకు శ్రీకాకుళం వేదిక
- ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పాలకుల నిర్లక్ష్య ధోరణి కారణంగా యువత సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోందని, సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, ఇలాంటి తరుణంలో యువజన సమస్యల పరిష్కారానికి వేదికగా శ్రీకాకుళం జిల్లా కానుందని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలను శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక విసీలా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ అయిన శ్రీకాకుళంలో ఈ మహాసభలు నిర్వహించడం చరిత్రాత్మకమవుతుందని అన్నారు. ఈ జిల్లాలో జరిగిన భూపోరాటాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. మోదీ అధికారంలోకి రాక మునుపు దేశం అప్పు రూ.50 వేల కోట్లు ఉండేదని, మోదీ హయాంలో అది రూ.160 కోట్లకు చేరుకుందని ఆయన విమర్శించారు. మోదీ రాక మునుపు చేసిన అప్పునకు కొన్ని ప్రాజెక్టులు నిదర్శనంగా ఉన్నాయని, మోదీ చేసిన అప్పు ఏ రూపాన ఖర్చు పెట్టారో బీజేపీ పెద్దలకే తెలియాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టడమే మోదీ ఘనత అని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రానికి తలమానికమైన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. మోదీతో దేశ భవిష్యత్‌కు ప్రమాదమని, ఇలాంటి నిరంకుశ పాలకులను సాగనంపాలంటే ఆ ఉద్యమాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని కోరారు. 1966లో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని, ఉద్యమంలో యువత కీలకంగా వ్యవహరించిందని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో కురిసిన వాన సముద్రం పాలు, ఉత్తరాంధ్ర యువత వలసల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న నదులను అనుసంధానిస్తూ వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలకులు ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో స్థానిక యువత సమస్యలతో పాటు దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు యువజన సంఘాల్లో కీలక పాత్ర వహించి చట్టసభల్లో సభ్యులుగా చేరి మంత్రులుగా, ముఖ్యమంత్రిగా సేవలందించినవారు, కమ్యూనిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, సీపీఐ శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల కార్యదర్శులు చాపర వెంకటరమణ, కూరంగి మన్మధరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.యుగంధర్, బాబి, సంతోష్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస రావు, జిల్లా అధ్యక్షులు జి.వాసు, జిల్లా మాజీ అధ్యక్షులు చింతాడ కృష్ణారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, సీపీఐ, యువజన, కార్మిక, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభల ఆహ్వాన సంఘం

ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, చీఫ్ ప్యాట్రన్స్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, అధ్యక్షులుగా సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్ లాల్, ప్రధాన కార్యదర్శిగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, కోశాధికారిగా జిల్లా కార్యదర్శి చాపర వెంకట రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.వాసు తదితరులను ఎన్నుకున్నారు.

సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం కోరుతూ
రేపు మానవహారం

విశాలాంధ్ర-గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడిపి... సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్ నరసింహారావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోనే ఏకైక అతిపెద్ద కర్మాగారం విశాఖ ఉక్కు అన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 6న అగనంపూడి నుండి గాజువాక వరకు మానవహారం కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం 27 జనవరి 2021న 100 శాతం అమ్మేస్తామని ప్రకటించిందన్నారు. ఆ నిర్ణయాన్ని మార్చుకొని... సెయిల్‌లో విలీనం చేయాలంటూ 1330 రోజులుగా కార్మికులు, నిర్వాసితులు రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరాటం కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడాన్ని ఆక్షేపించారు. ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఉద్దేశపూర్వకంగా నష్టాల పాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ముడి సరుకు కొరత సాకుతో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో ఉత్పత్తిని నిలిపివేశారని నిందించారు. కార్మికులు, నిర్వాసితుల పోరాట ఫలితంగా 4200 మంది ఒప్పంద కార్మికులను యాజమాన్యం తాత్కాలికంగా వెనక్కు తీసుకుందని తెలిపారు. ఉక్కు యాజమాన్యం ఉద్యోగులపై ఆర్థిక ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ లక్ష్యంగా ఆరున మానవహారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

చంద్రబాబు అబద్ధాలకు అంతేలేదు

లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం... ప్రజలకు క్షమాపణ చెప్పాలి
జగన్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుకు భయం, భక్తీ రెండూ లేవని, అవి ఉంటే తిరుపతి లడ్డూపై చేసిన అబద్ధపు ప్రచారానికి పశ్చాత్తాపం ప్రకటించే వారని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ కల్తీపై ఇప్పటికీ చంద్రబాబు అబద్ధాలు చెబుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. రాజకీయాలకు దేవుడ్ని దూరంగా ఉంచాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. లడ్డూ కల్తీపై సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు అక్షింతలు వేసినా చంద్రబాబు తీరు మారలేదని, వైసీపీ నేతలపైనే సుప్రీంకోర్టు ఆగ్రహం అంటూ ట్వీట్‌లు చేయడం ఆశ్చర్యంగా ఉందని జగన్ తప్పుపట్టారు. దారుణంగా వక్రీకరిస్తూ చంద్రబాబు తన స్థాయిని దిగజార్చుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ ట్విట్టర్‌లో టీడీపీ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. లడ్డూ వివాదంలో జాతీయ మీడియానూ చంద్రబాబు తప్పుపట్టారని గుర్తుచేశారు. మత విశ్వాసాలను ఎలా రెచ్చగొడుతున్నారో సుప్రీం అర్థం చేసుకుందని వివరించారు. దేవుడ్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని సుప్రీం ఆదేశించిందని, చంద్రబాబు స్వయంగా వేసుకున్న సిట్‌ను సుప్రీం రద్దు చేసిందన్నారు. లడ్డూ కల్తీపై టీటీడీ ఈవో, చంద్రబాబు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారని చెబుతూ... అందుకు సంబంధించిన వీడియోలను మీడియా ఎదుట జగన్ ప్రదర్శించారు. లడ్డూలో కల్తీ జరగలేదని, జులై 23వ తేదీన నెయ్యి ట్యాంకర్లు తిప్పిపంపినట్లు ఈఓ చెప్పారని జగన్ గుర్తుచేశారు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. అధికారం చేపట్టి నాలుగు నెలలైనా ఒక్క హామీ అమలు చేయలేదని చెప్పారు. తిరుమల పవిత్రను చంద్రబాబు అపవిత్రం చేశారన్నారు. ప్రసాదంలో కల్తీ జరగకుండా తిరుమలలో గొప్ప వ్యవస్థ ఉందన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం దేవుడంటే భయం భక్తి లేకుండా పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. చంద్రబాబు తీరుపై ప్రధానికి, సుప్రీంకోర్టు ప్రధాని న్యాయమూర్తికి తాను లేఖ రాసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. అంతకుముందు వైసీపీ ముఖ్యనేతలు బొత్స సత్యనారాయణ, కన్నబాబు తదితరులతో జగన్ భేటీ అయ్యారు.

పట్టు పరిశ్రమ రైతులను ఆదుకుంటాం

మండలి బుద్ధప్రసాద్, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి: కమ్యూనిస్టు పార్టీల పోరాటం రైతుల పక్షానే ఉంటుందని స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వెలివోలు గ్రామంలో చల్లపల్లి, ఘంటసాల మండలాల వరద బాధిత పట్టు పరిశ్రమ రైతులకు పట్టు పురుగుల ఔషధముల ఉచిత పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఏపీ పట్టు పరిశ్రమ సహకారంతో రెయిన్ బో ఆగ్రో వెట్ సిరి టెక్నాలజీస్ ఎండీ బొడి చర్ల వెంకట సుబ్బారాయుడు అధ్వర్యంలో సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దిరిశాల వాణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వందమంది రైతులకు రూ.రెండు వేలు చొప్పున రూ.రెండు లక్షల విలువైన ఔషధాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా వచ్చారు. పట్టు పురుగుల పెంపకందారులు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు అమలు చేసిన రాయితీలు, ప్రోత్సాహాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని, దీంతో అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు రైతుల సమస్యలు విన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సెరీకల్చరుకు ప్రాధాన్యత ఇచ్చిందని, తమ ప్రభుత్వం పట్టు పురుగుల పెంపకందారులకు మేలు చేసేందుకు త్వరలో విధాన రూపకల్పన చేస్తుందన్నారు. సెరీకల్చరుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలనే సూచన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మునుపెన్నడూ లేనిస్థాయిలో తమ ప్రభుత్వం రైతులకు వరద సాయం అందించిందన్నారు. పట్టు గూళ్ల ఉత్పత్తి చేస్తున్న రైతులకు సరైన ధర అందేలా కృషి చేస్తామన్నారు. కృష్ణా డెల్టా ఉద్యమంలో కొల్లి నాగేశ్వరరావు, ఏవీ గోపాలరావుతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ లంక గ్రామాలకు వెళ్లేందుకు రైతులకు కాలిబాట వంతెన నిర్మాణం చేయాలని కోరారు. పట్టు పురుగుల మార్కెట్‌లో దళారీ వ్యవస్థ లేకుండా చేయాలన్నారు. రాష్ట్రంలో ఏ మార్కెట్‌లో ఎంతవిలువ ఉందో రైతులకు తెలిసేలా ధరల పట్టికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దిరిశాల వాణి మాట్లాడుతూ 30 ఏళ్లుగా పట్టుపురుగుల పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వెలివోలు లంక రైతులు ఈసారి పెద్ద షెడ్లు నిర్మించుకోవాలని, మల్బరీ తోటల సాగులో తప్పనిసరిగా గేదెల ఎరువు వినియోగించాలని సూచించారు. బొడిచర్ల వెంకట సుబ్బారాయుడు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో తమ సంస్థ ద్వారా వరద ప్రభావిత గ్రామాల్లో రూ.5 లక్షలు కేటాయించి సెరీకల్చర్, హార్టికల్చర్ రైతులకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ వేములమడ రజిత, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీఘోరీ, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఏపీటీపీసీ చైర్మన్‌గా బాబూరావు బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్‌గా నియమితులైన వజ్జా బాబూరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఏపీటీపీసీ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సీఎం విజన్ మేరకు కలిసికట్టుగా పని చేస్తామన్నారు. వీసీ అండ్ ఎండీ, జనరల్ మేనేజర్, ఇతర సభ్యులు చైర్మన్ బాబూరావుకు అభినందనలు తెలియజేశారు.

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఉద్యోగినులకు పాప్‌స్మియర్, మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ వైద్యసేవలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తిరుపతిలోని స్విమ్స్ శ్రీ బాలాజి ఇన్‌స్టిట్యూట్ అధ్వర్యంలో అమరావతిలోని సచివాలయ ఉద్యోగినులకు రెండు రోజుల పాటు జరిగిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. బ్లాక్ నంబరు మూడులో ఉన్న మహిళా ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో జరిగిన వైద్యపరీక్షల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ మహిళా అసోసియేషన్ అభ్యర్థన మేరకు సచివాలయంలో పింక్ బస్ క్యాంపు నిర్వహించారు. నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు పాప్ స్మియర్, రొమ్ము క్యాన్సరుకు సంబంధించిన మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేపట్టారు. ఒక్కొక్కరికి రూ.పది వేలు ఖర్చయ్యే పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. గుంటూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి వచ్చిన గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టి, డెంటల్ సర్జరీ వైద్య నిపుణులు వైద్యసేవలందించారు. ఎన్సీడి స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారద, స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ అధికారి డాక్టర్ అనిల్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, పీఆర్వో డి.చంద్రమోహన్, సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కె.వైదూరిదేవి, వైస్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మణకుమారి, సెక్రటరీ ఏ సుస్మిత, అడిషనల్ సెక్రటరీలు ఎం.రాజేశ్వరి, ఎన్.నాగలలితా దేవి, జాయింట్ సెక్రెటరీ కె.సునీత, ట్రెజరర్ టి.శారద పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు బెయిల్

సజ్జల రామకృష్ణారెడ్డికి ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీకి చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇదే కేసులో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఈ కేసుపై హైకోర్టులో శుక్రవారం రెండు వర్గాల న్యాయవాదులు వాదనలు విన్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదించారు. ఎంపీ సురేశ్‌పై ఉన్న హత్య కేసుపై తుళ్లూరు పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. తుళ్లూరు పోలీసులు వేసిన పీటీ వారెంట్‌కు ట్రయల్ కోర్టు అనుమతించింది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి గత నెలలో నందిగం సురేశ్ అరెస్ట్ అయ్యారు. హైకోర్టులో వాదనల అనంతరం సురేశ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. కాగా, సజ్జల రామకృష్ణారెడ్డిపై ఈ నెల 25వ తేదీ వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఘటన జరిగిన రోజున సజ్జల పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉన్నారని, ఈ కేసులో నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఉందని పోలీసుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ఆయన అధ్వర్యంలోనే ఈ దాడి జరిగిందని సిద్దార్థ లూథ్రా వాదించారు. కేసు విచారణను హైకోర్టు ఈనెల 25కు వాయిదా వేసింది.

రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన పవన్: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజ్యాంగానికి విఘాతం కలిగించేలా మాట్లాడారని సీపీఎం విమర్శించింది. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు, అదే రాజ్యాంగంలోని లౌకికవాదంపై విమర్శలు గుప్పిస్తూ దానిని ఉల్లంఘిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. పవన్ తీరును ఆక్షేపిస్తూ శుక్రవారం ఒక ప్రకటన చేశారు. మత సామరస్యాన్ని కోరుకునే వారిని, మతోన్మాదాన్ని వ్యతిరేకించే వారిని సూడో సెక్యులరిస్టులంటూ లౌకికవాదాన్ని హేళన చేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఇలాంటి వ్యవహారంతో బీజేపీ, ఆరెస్సెస్, సంఘ్ పరివార్ ఉచ్చులో పవన్ పడినట్లు స్పష్టమవుతోందని, ఇది రాష్ట్రానికి హానికరమని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో 'వారాహి డిక్లరేషన్' సభలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పవన్ మాట్లాడారని,. ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఓ మతతత్వవాదిగా వ్యవహరించడం తగదని ఆయనకు హితవు పలికారు. 'సూడో సెక్యులరిజం' అంటూ చులకనగా మాట్లాడడం, కోర్టులకు ఉద్దేశాలు ఆపాదించి, వ్యాఖ్యలు చేయడం న్యాయవ్యవస్థను అగౌరవపర్చడమే అని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

డయేరియాతో ఇద్దరు వృద్ధుల మృతి

విశ్వనాథపురంలో వైద్యశిబిరాల ఏర్పాటు
తాగునీరు కలుషితం వల్లే: వైద్యులు

విశాలాంధ్ర, పార్వతీపురం/ పాచిపెంట: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన మరువకముందే పాచిపెంట మండలం విశ్వనాథపురంలో డయేరియా వ్యాధి లక్షణాలతో ఇద్దరు వృద్ధులు మృత్యువాత పడ్డారు. మరో 30 మందికి పైగా డయేరియాతో బాధపడుతున్నారు. వివరాల్లోకి వెళితే... డయేరియా లక్షణాలతో పీ సీతన్న (78), ఎల్.బంగారమ్మ(76) కొద్ది రోజుల క్రితం విశాఖపట్నం కేజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. వ్యాధి తీవ్రం కావడంతో గురువారం రాత్రి మృతిచెందారు. పాచిపెంటలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు వైద్యాధికారి జీ వెంకటరమణ తెలిపారు. డయేరియా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న ఏడుగురిని సాలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు తరలించినట్లు వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయపార్వతి శుక్రవారం గ్రామాన్ని సందర్శించి వ్యాధి లక్షణాలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. నీటి శాంపిల్స్ తీసి నిర్ధారణకు పంపినట్లు చెప్పారు. డాక్టర్ శ్రీధర్, జిల్లా ప్రోగ్రాం అధికారి రఘు కూడా గ్రామాన్ని సందర్శించారు. మంచినీటి కలుషితం వలన డయేరియా లక్షణాలు కనిపిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గ్రామాన్ని సందర్శించి డయేరియా . ప్రబలడానికిగల కారణాలపై వైద్య సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు సక్రమంగా అందడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు సకాలంలో అందకపోవడం వలన ఇటీవల మరణాలు పెద్దఎత్తున సంభవిస్తున్నాయన్నారు. రిఫరల్ పేరిట రోగులను విజయనగరం, విశాఖపట్నం తరలించడం వలన మరణాలు ఎక్కువవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కే మన్మథరావు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

రెండో రోజు టెట్‌కు 86శాతం హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్)- 2024 భాగంగా రెండో రోజైన శుక్రవారం తెలుగు, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో అర్హత పరీక్షలు జరిగాయి. ఏపీ టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం ఈ పరీక్షలలో18,906కిగాను 16,430 మంది (86శాతం) హాజరయ్యారు. 37 సెంటర్లలో ఉదయం జరిగిన స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 5,940కిగాను 5,053 మంది (85.07 శాతం) హాజరు కాగా మధ్యాహ్నం 65 సెంటర్లలో జరిగిన స్కూల్ అసిస్టెంట్స్ ఇంగ్లీష్ పరీక్షలకు 12,960కిగాను 11,377 మంది (87.78 శాతం) పరీక్ష రాశారు. శనివారం ఇంగ్లీష్, హిందీ స్కూల్ అసిస్టెంట్స్ ఉపాధ్యాయులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 3వ తేదీ నుంచి టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 17 రోజులపాటు రోజుకు రెండు విడతలుగా కొనసాగుతాయి. మొదటి రెండు రోజులు ప్రశాంతంగా గడిచాయని అధికారులు వెల్లడించారు.

మైనింగ్ మాఫియా కొత్త ఎత్తుగడ!

నల్ల రాయి అక్రమ క్వారీలపై స్పందించని అధికారులు
గిరిజనులను బెదిరిస్తూ... డబ్బు ఆశ చూపుతున్న వైనం



విశాలాంధ్ర -పాడేరు: సహజ సంపద నాశనమై పోతున్నా... కొండలు పిండి అవుతున్నా... అడవులు బుగ్గిపాలవుతున్నా... గిరిజనులు జీవనోపాధి కోల్పోతున్నా పాలకులకు, ప్రభుత్వ యంత్రాంగానికి పట్టడం లేదు. ఇదే అదునుగా మైనింగ్ మాఫియా చెలరేగిపోతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసీలను రక్షించడం కోసం, ప్రకృతి సంపద పరిరక్షణ కోసం అనేక చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ, ఐటీడీఏ లాంటి అత్యున్నత వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ అవేమీ ఇప్పుడు పనికిరాకుండా పోయాయి. నల్ల రాయి అక్రమ క్వారీల విషయంలో మైనింగ్ మాఫియా మరిన్ని అక్రమాలకు తెరలేపింది. గిరిజన ప్రజలను మభ్యపెట్టేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. బెదిరింపులకు పాల్పడటమే కాకుండా, డబ్బు కూడా ఆశ చూపుతూ మరిన్ని అక్రమాలకు తెరలేపిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది అధికారులు ప్రజా ప్రతినిధులకు, మైనింగ్ మాఫియాకు భయపడో లేదా ఆర్థిక లావాదేవీలకు ఆశపడో బాధ్యతను సక్రమంగా నిర్వహించడం లేదు. ఫలితంగా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న గిరిజనుల గోడు అరణ్య రోదనే అవుతోంది. దేవరపల్లి నల్ల రాయి క్వారీలో అక్రమాలపై 'విశాలాంధ్ర' తో పాటు మరికొన్ని పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ కథనాల నేపథ్యంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోయి సంబంధిత గ్రామాల్లో ప్రజలకు డబ్బు ఆశ చూపి మభ్య పెట్టాలని చూస్తున్నారు. అయితే మైనింగ్ మాఫియా మాటలను అంగీకరించకుండా తమ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని గ్రహించి, మైనింగ్‌ను ఒప్పుకోని విద్యావంతులను, స్థానిక గిరిజన మేధావులను మైనింగ్ మాఫియా బెదిరిస్తోంది. అంతేకాకుండా వారికి అధిక మొత్తంలో డబ్బు ఆశ చూపుతూ అనేకమార్లు మంతనాలు జరుపుతున్నారు. ఈ పరిణామాలన్నీ గమనిస్తే సంబంధిత అధికారులు మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తున్నారని, వారి నుంచి ఆర్థికంగా లాభం పొందుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ అక్రమాలపై ఒకప్పుడు గొంతు ఎత్తిన నాయకులు, ప్రజాసంఘాలు ప్రజా ప్రతినిధులు అక్రమార్కులకు భయపడో, వారికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులు సహకారం ఉందనో, వారిచ్చే ఆర్థిక లాభాలకు ఆశపడో ఇప్పుడు గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా నోరు మెదకపోవడం మేధావి వర్గంలో, స్థానిక విద్యావంతుల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా గిరిజనుల అభ్యున్నతి కోసమే రాజకీయాల్లోకి వచ్చామనే నాయకులు, గిరిజన ప్రాంత హక్కులు, చట్టాల కోసం పోరాడుతున్నామనే గిరిజన ప్రజా సంఘాలన్నీ వారి పదవుల కోసం కాకుండా నిజంగా గిరిజనుల పక్షాన పోరాడాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ మాఫియా వల్ల తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నిట్ నెం.06/ఇప్రొక్యూర్/టిఓ/2024-25, తేది : 01-10-2024
పని వివరం : ఏపీ రాజ్ భవన్ సిబ్బందికి 2024-25 కాలానికి కుట్టిన యూనిఫాం, డ్రెస్, బ్యాడ్జిలు, టోపీలు, బూట్లు, సాక్స్‌లు మొదలైనవి సరఫరా. అంచనా విలువ : రూ.20.60 లక్షలు. టెండర్ల స్వీకరణకు చివరి తేది : 08-10-2024 నుంచి 14-10-2024వ తేదీ మధ్యాహ్నం 3.30గంటల వరకు. ఇతర వివరాలను www.eprocurement.gov.in ను నుంచి పొందవచ్చు.
సం/-ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, (ఆర్ & బి) డివిజన్, విజయవాడ
DIPR/14206/CL/ADVT-1/1/2021-22 Dt. 4-10-2024

సంపాదకీయం

లడ్డూ రగడపై సుప్రీం "సిట్"

రాజకీయ వివాదాల చాకిరేవుగా తయారైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందో లేదో తేల్చడానికి సుప్రీంకోర్టు శుక్రవారం ఓ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. మునుపటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే తిరుపతి లడ్డూలో పశువుల కొవ్వు, పంది కొవ్వు, చేపనూనె లాంటివి కలిశాయి అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో ఈ వివాదం చెలరేగింది. కల్తీ వ్యవహారం నిగ్గు తేల్చడానికి ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో దర్యాప్తు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో జరగాలని కూడా న్యాయమూర్తులు ఆదేశించారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందంలో సీబీఐకి చెందిన ఇద్దరు అధికారులు, ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారులు ఇద్దరు, ఆహార భద్రత ప్రమాణాల భారత సంస్థ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ.)కి చెందిన ఒక సీనియర్ అధికారి ఉంటారు. సుప్రీకోర్టు న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్ తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. లడ్డూ కల్తీ వ్యవహారం కోట్లాదిమంది భక్తుల నమ్మకానికి సంబంధించిన అంశం కనక సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. తిరుపతి వెంకన్న మీద భక్తి ప్రపత్తులున్న వారు కేవలం తెలుగు రాష్ట్రాలలోనే కాక దేశవ్యాప్తంగా ఉన్నారు. లడ్డూ వివాదం ఓ వేపు కొనసాగుతున్నా తిరుపతి వెంకన్నను దర్శించుకునే భక్తుల సంఖ్య, లడ్డూ ప్రసాదం కొనుగోళ్లు ఇసుమంత కూడా తగ్గలేదు. అంటే మత విశ్వాసాల ముందు కల్తీ గిల్తీ ఎందుకూ కొరగావు అనుకోవాలి. వివాదం చెలరేగగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకే "సిట్" ఏర్పాటు చేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన "సిట్" మాత్రమే దర్యాప్తు కొనసాగిస్తుందనుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్థత మీద కానీ, విశ్వసనీయత మీద కానీ తమకు అనుమానాలు ఏమీ లేవని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చెప్పారు. అయితే ఇది భక్తుల విశ్వాసానికి సంబంధించిన విషయం కనక తాము "సిట్" ఏర్పాటు చేస్తున్నామని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వివరణ ఇచ్చారు. పార్లమెంటు మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు డా. సుబ్రహ్మణ్యం స్వామి, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మొన్నటిదాకా తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి.) అధ్యక్షుడు వై.వి. సుబ్బారెడ్డి, చరిత్రకారుడు విక్రం సంపత్, వైదిక నిపుణుడు దుష్యంత్ శ్రీధర్, సుదర్శన్ టీవీ వార్తా కార్యక్రమాల ప్రయోక్త సురేశ్ చవహ్నకె దాఖలు చేసిన పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు "సిట్" ఏర్పాటుకు ఆదేశించింది. ఈ వివాదం అత్యున్నత న్యాయస్థానం పరిశీలనకు వచ్చినప్పుడు దర్యాప్తు ఏదీ జరగకుండానే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ హయాంలో తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగంగా ప్రకటించడాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ విషయం ఆయనకు తెలిసిన రెండు నెలల తరవాత బయట పెట్టడంలో ఆంతర్యం ఏమిటి అని కూడా నిలదీశారు. కల్తీ జరిగినట్టు నికరమైన నిరూపణ జరగక ముందే ఏ ఆధారంతో చంద్రబాబు యాగీ చేస్తున్నారు అని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు చంద్రబాబు కానీ, ఆయన ప్రభుత్వం కానీ ఇంతవరకు ఏ వివరణా ఇవ్వలేదు. కల్తీ జరిగిందో లేదో "సిట్" దర్యాప్తు తరవాత తేలితే తేలొచ్చు కానీ రాజకీయ ప్రత్యర్థి అయిన జగన్‌ను అపఖ్యాతిపాలు చేయడానికి చంద్రబాబు ఈ అంశాన్ని వినియోగించుకున్నారన్న భావన విస్తృతంగా పాకింది. కొద్ది రోజుల కిందట ఈ అంశం పరిశీలనకు వచ్చినప్పుడు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "సిట్" దర్యాప్తుకు బదులు మరే దర్యాప్తు అయినా జరగాలా అని కూడా న్యాయమూర్తులు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను అడిగారు. ఈ అంశం శుక్రవారం మళ్లీ సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చినప్పుడు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "సిట్" పనిని కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థ అధికారి పర్యవేక్షించవచ్చునని సలహా ఇచ్చారు. కల్తీ జరిగిందన్న అంశాన్ని తాను కూలంకషంగా పరిశీలించానని, ఒక వేళ అలాంటిది ఏమైనా జరిగితే అది భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తుందని అన్నారు. అంతే కాక ఆహార భద్రత చట్టం కూడా ఉందని గుర్తు చేశారు.

శుక్రవారం విచారణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగి, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున వాదిస్తున్న లుథ్రా రాష్ట్ర ప్రభుత్వాన్ని వెనకేసుకు రావడంలో సోలిసిటర్ జనరల్‌కు ఏ మాత్రం తీసిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "సిట్" లో కేంద్ర ప్రభుత్వ అధికారిని చేరిస్తే చాలు అని తుషార్ మెహతా వాదించడం అంటే రాష్ట్ర ప్రభుత్వ వాదనకు ఆయన కేంద్ర ప్రభుత్వం తరఫున వత్తాసు పలుకుతున్నారనే అర్థం. నిజానికి ఈ వివాదం జగన్‌ను అపఖ్యాతిపాలు చేయడానికి రేపి ఉండొచ్చు. కానీ పశువుల కొవ్వు, పంది కొవ్వు లాంటి మాటలు వాడడంవల్ల చంద్రబాబు నాయుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి తాను అత్యంత విశ్వాసపాత్రుడిని అని రుజువు చేసుకోవాలన్న ఆతృత స్పష్టంగా కనిపించింది. ఈ రెండు రకాల కొవ్వులను ప్రస్తావించడం అంటే ముస్లింలను, క్రైస్తవులను ముగ్గులోకి లాగడానికేనని భావించడానికి అవకాశం మెండుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన దర్యాప్తును కొనసాగనివ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న ముకుల్ రోహ్తగి చెప్పడంలో ఆంతర్యం సులభంగానే గ్రహించవచ్చు. రోహ్తగి ఒక అడుగు ముందుకువేసి ఏ దర్యాప్తూ జరగకుండానే లడ్డూలో పంది కొవ్వు కలిసిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ముందు చెప్పడంలో మతలబు ఏమిటో కూడా అర్థం అవుతూనే ఉంది. "ఏ నివేదికలో ఈ మాట చెప్పారు" అని వై.వి.సుబ్బారెడ్డి తరఫున వాదిస్తున్న కపిల్ సిబల్ అడగాల్సిన ప్రశ్నే అడిగారు. "నివేదికలో ఉంది" అని రోహ్తగి సమాధానం ఇచ్చారు. "లడ్డూలో వనస్పతి కలిసి ఉండొచ్చు కానీ పశువుల కొవ్వు కాదు. అందువల్ల నిష్పాక్షిక దర్యాప్తుకు ఆదేశించవలసిందే" అని సిబల్ అభ్యర్థించారు. జులై నాలుగు దాకా అందిన నెయ్యిని పరీక్షించలేదని, జులై 6 నుంచి 12 మధ్య అందిన నెయ్యి నమూనాలను మాత్రమే పరీక్షించారని తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున వాదిస్తున్న సిద్ధార్థ లుథ్రా తెలియజేశారు. ఈ వాదోపవాదాలు విన్న అత్యున్నత న్యాయస్థానం చివరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "సిట్" కు బదులు సీబీఐ పర్యవేక్షణలో మరో "సిట్" ఏర్పాటు చేయాలని ఆదేశించింది. "ఈ విషయాన్ని రాజకీయ నాటకలకు వేదికగా మార్చకూడదు. ఇది కోట్లాది భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశం. ఈ వివాదంతో సంబంధంఉన్న రెండు పక్షాలూ రాజకీయ ప్రత్యర్థి పక్షాలే" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం విశేషం. సుప్రీంకోర్టు నిర్ణయం తామే తుమ్మి తామే "చిరంజీవ"అనుకునే అవకాశం లేకుండా చేసింది.

ఆయనకి మరణం ప్రతీ రాత్రి పొడిచే చుక్క

ఏం లేదు. ఏం కాదు. జీవితాల గురించే... సృజనకారుల జీవితాల గురించే మాట్లాడుతున్నాను. నాలుగు కవితలు రాసో, ఓ కథలో మరచిపోలేని సంఘటనను వివరించో, మరో గొప్ప చిత్రాన్ని గీసో ఆహో, ఓహో అని పేరు తెచ్చుకున్న వాళ్లందరి జీవితాలు "అయ్యో" అన్నట్లుగా ముగిసిపోతున్నాయేమిటా అనే కలత చెందుతున్నాను. రేపొద్దున ఇలా ఎవరి ఆకాల, సృజన లోకానికి తెలియకుండా వెళ్లిపోయిన వారి గురించి ఎక్కడ వినాల్సివస్తోందో అని భయపడుతున్నాను. అలాగని ఈ మధ్య విన్న సుమనశ్రీ ఇరవై రోజుల నాటి మృతి గురించి కాదు. మొన్నామధ్య రెండేళ్ల క్రితం "ఎప్పుడో అలా వెళ్లిపోయాడు ఏకాకిలా" అని చిత్రకారుడు చంద్ర గురించి విన్నప్పుడు కూడా కాదు. కాలేజీ రోజుల్లో తన్మయత్వంగా చదువుకుని "ఇలా రాయాలి కథంటే" అనుకుని... యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చాక హైదరాబాద్ చిక్కడపల్లి రోడ్లపై ఆ కథకుడు కనిపిస్తే "ఆ కథలేంటీ... ఈనాటి మీ వైఖరేంటి" అని అమాయకంగా ప్రశ్నించినప్పుడు నవ్విన ఆ శ్రీపతి కళ్లు ఈ మధ్యనే మగతగా మూసుకుపోయాయని తెలిసి కార్చే కన్నీరూ కాదు. మన మనిషి లేడని, ఆ సృజనకారుని పుస్తకాల్లో కవిత్వమేతప్ప అతడు వినపడడని ఎక్కడో దూరాన ఉన్న వారికి మనం చెప్పేవాళ్లం. ఆ మధ్య ప్రారంభమైన సామాజిక మాధ్యమాలు కూడా కూసేవి. కాకపోతే, ఫారం కోడిలా ఎప్పుడు పడితే అప్పుడు కూస్తున్న ఆ మాధ్యమాల కూతలు నిజం కాదని ఆ తర్వాత తెలిసి కాసింత స్థిమిత పడుతున్నాం. అందుకే ఆ సామాజిక మాధ్యమాల

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

నమ్మికని కూడా వదిలేశాం.

కానీ మరీ ఇంత అన్యాయమా... తన కవిత్వంతో, కథలతో, అద్భుత బొమ్మలతో, పాటలతో, స్నేహాలతో, ప్రసంగాలతో హోరెత్తించిన వారిలో కొందరు ఇక లేరని, ముమ్ముందు మాట్లాడేందుకు కూడా అందరని... కొన్ని రోజుల తర్వాత తెలియడం సాహిత్యలోకపు విషాదం. సృజనకారులందరికి ఏక కాలంలో తగిలిన శాపం.

మూడు దశాబ్దాల క్రితం కోఠిలో 219 నంబరు సీటీ బస్సో, కవి సిద్ధార్థ ఇప్పించిన టీ తాగి లకడీకాపూల్ నుంచి కాలి నడకనో బీహెచ్ఈఎల్‌కు వెళ్లి గేటు ముందు "సుమనశ్రీ హై" అని హిందీలో అడిగితే ఆ నీలం బట్టలేసుకుని, చేతిలో మాయాబజార్‌లో వివాహ భోజనంబు పాట తర్వాత ఘటోత్కచుడి చేతిలో అతి చిన్నగా మారిపోయిన గదలాంటి కర్రతో ఉన్న సెక్యూరిటీ వాడు "క్యా" అంటూ కూసేవాడు. మనకి అంతకు మించి హిందీ రాదు కాబట్టి... "పొట్టి హై... టక్ హై... స్కూటర్ హై.. బహుత్ మంచివారు హై" అని బతిమాలుతున్నట్లుగా ముఖం పెడితే.... ఇతగాడు కాకుండా లోపల ఆ చిన్నగదిలో పెద్ద పెట్టెలాంటి దానిపై అంకెలున్న ఫోన్ ముందు కూర్చున్న ఓ పెద్ద బొజ్జున్న సెక్యూరిటీ ఆయన "ఏ కామేశ్వరరావు సాబ్ హై. ఉదర్ బైటో" అంటూ ఎవరికో ఫోన్ చేసేవాడు. మనం ఆతగాడు చెప్పిన ఆ ఉదర్ దగ్గర బైటుతాం కదా... అంతే లోపలి నుంచి పీ.టీ. ఉష పరుగులాంటి నడకతో కవిత్వ సంకలనం పరుగులు పెడుతున్నట్లుగా వచ్చేవారు సుమనశ్రీ. కో అనక్కర్లేదు కాని పిలిస్తే పదిమంది బయటకు వచ్చి మనల్ని తోడ్కొని వెళ్తారు ఆయన గాజు అద్దాల కేబిన్‌లోకి. చెల్లపిళ్ల కామేశ్వరరావు అయితే అదేపని చేసేవారేమో.... ఈయన సుమన శ్రీ కదా... అందుకే ఆయనే నడిచి వచ్చి కౌగిలించుకునే వారు. ఆ దృశ్యాన్ని చూస్తున్న నీలం బట్టలు, చేతిలో గదతో ఉన్న ఆ సెక్యూరిటీ ఆసామిని చూస్తే చెప్పొద్దు నవ్వొచ్చేది. సరిగ్గా అప్పుడే అతను కాలిని నేలకేసికొట్టి చెల్లపిళ్ల వారబ్బాయికి శాల్యూట్ కూడా చేసేవాడు... అక్కడికి వెళ్లిన ఆ కుర్రకుంకలు పసునూరి శ్రీధర్ బాబు, నున్నా నరేషూ, చల్లా శ్రీనివాస్‌తో సహా చక్రం అనే నా గుండెలు కూడా పొంగేవి. వీళ్లతోనే కాదు..... ఏకాకీగా నేనొక్కడినే వెళ్లిన రోజులూ అనేకం. ఆయన రాసిన కవిత్వం పెద్దగా వినిపించిన గుర్తులేదు. ఈ కుర్రోళ్లు ఏం రాశారో వినాలి అన్నట్లుగా ఆయన ఆపాదమస్తకం చెవుల్లా మారిపోయేది. ఆయన్ని కలిసిన వారిలో పెద్దగా కవిత్వం వినిపించని వాడిని నేనేనేమో. మిగిలిన ఆనాటి కుర్ర కవులు శ్రీధర్ బాబు, నున్నా నరేష్, సిద్ధార్థ, చల్లా శ్రీనివాస్ మాత్రం సుమనశ్రీని కలిసిన ప్రతిసారి ఏదో ఓ కవిత వినిపించే వారు. "నువ్వు వినిపించవేం" అని అడిగితే... ఓ చేతగానితనపు నవ్వు నవ్వేవాడ్ని. అయితే, ఆయనతో సహా ఇతర కవుల కవిత్వాన్ని మాత్రం నచ్చితే మెచ్చుకుని, లేకపోతే చీల్చి చెండాడుతూంటే మాత్రం "ఇందుకే చక్రి కవిత్వం రాయడు. అతడ్ని ఎవరూ ఏం అనకుండా జాగ్రత్తలు. కోనసీమ తెలివితేటలు" అనేవారు సుమనశ్రీ. నేను నా పెదాలని వెటకరిస్తూ "కాదు సార్. నాకు కవిత్వమంటే చాలా ఇష్టం. అందుకే రాయను. వీళ్ల గురించి నాకు తెలీదు" అని నవ్వేవాడ్ని. ఆ మాటకి సుమనశ్రీ పడి పడి నవ్వుతూంటే ఆ పొట్టని బయట పడేయాలని నడుంకి ఉన్న ఆ తోలు బెల్టు తెగ తాపత్రయపడేది. ప్రతి నెలా జరిగే నెల నెలా వెన్నెల సాహిత్య సమావేశంలో కృష్ణారావు తర్వాత రెండో పెద్ద మనిషి సుమనశ్రీయే. వయసుకే వీళ్లిద్దరూ పెద్ద మనుషులు. అల్లరి చేయడంలో మా కంటే చిన్నవాళ్లు. చేరాతలతో సహా, ఆ నెలలో వచ్చిన కవిత్వంలో చెత్త గురించి నేను నోరు పారేసుకుంటే "మరీ అలా తిట్టకు. వాళ్లు వింటే అంత బాగోదు" అని ఓ మర్యాద పూర్వక హెచ్చరిక చేసేవారు సుమనశ్రీ.. మూడు దశాబ్దాల క్రితం మాతో కుర్రాడిలా, కాసింత పెద్ద వాళ్లతో పెద్దవాడిలా, మరింత పెద్ద వారి ముందు వినయంగా ఉండే సుమనశ్రీ వీళ్లెవరికీ చెప్పకుండా వెళ్లిపోవడం.... ఆయనే అన్నట్లు...

"మరణం నాకు కొత్త కాదు...
నా ప్రతి సమాధి స్థితి ఒక మరణమే
ఆకాశంలో ప్రతి రాత్రి పొడిచే చుక్కలా
....
మరణాన్ని నా శరీరంతో కావలించుకునే ఉంటాను"

సుమనశ్రీ అలాగే ఉండే వారేమో.... మనం గుర్తించలేకపోయాం. సుమనశ్రీ అనే కవినే కాదు... ఆయన మరణాన్ని కూడా...

సీనియర్ జర్నలిస్టు, 9912019929

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార వేడి

డి.సోమ సుందర్

ఇజ్రాయిల్ పై ఇరాన్ క్షిపణుల దాడి, రేవు కార్మికుల సమ్మె , ఆరు రాష్ట్రాల్లో ఇటీవల హరికేన్ సృష్టించిన విధ్వంసం వంటి అంశాలు అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో వేడిని పెంచాయి. అక్టోబర్ ఒకటో తేదీ రాత్రి జరిగిన ఉపాధ్యక్ష అభ్యర్థుల డిబేట్‌లో విధానపరమైన అంశాలపై మరోసారి రెండుపక్షాలు తమ వాదనలను గట్టిగా వినిపించాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం అమెరికా రాజకీయాల్లో చిరకాలంగా కొనసాగుతున్న ఆనవాయితీయే!

ఇజ్రాయిల్‌పై ఇరాన్ 250కి పైగా బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకు పడటం అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో వేడిని పెంచింది. అమెరికా సమాజంలో యూదు జాతీయులు పోషిస్తున్న కీలక భూమిక నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా తీసుకునే చర్యలకు దేశంలో విపరీతమైన ప్రాధాన్యం ఉంది. క్షిపణి దాడుల సమాచారం తెలియగానే అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఇద్దరూ అమెరికా వాయు, నావికా దళాల సంయుక్త ప్రధాన కేంద్రం "జాయంట్ బేస్ ఆండ్రూస్"కు చేరుకున్నారు. యుద్ధ చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. "దాడి సమాచారాన్ని ఇజ్రాయిల్‌కు ముందుగానే అందచేసాం, దాడులను ఎదుర్కోవడానికి ఇజ్రాయిల్‌లోని అమెరికా దళాలను అప్రమత్తం చేశాం, తమ దళాలు ఇజ్రాయిల్ దళాలతో కలిసి దాడులను సమర్థంగా ఎదుర్కొన్నాయి, ఇరాన్ క్షిపణులను గగనతలంలో ధ్వంసం చేయడానికి కృషి చేశాం" అంటూ అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. దాడులను ఖండిస్తూ తక్షణం వాటిని ఆపాలని బైడెన్ ఇరాన్‌ను హెచ్చరించారు. స్వీయ రక్షణకు ఇజ్రాయిల్‌కు గల హక్కుకు అమెరికా పూర్తిగా మద్దతు ఇస్తుందని కమలా హారిస్ ప్రకటించారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలు యుద్ధ చర్యల పర్యవేక్షణలో తలమునకలుగా ఉండగా పూర్వాధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో వారిద్దరిపై మాటల దాడి కొనసాగించారు. అమెరికాలో బైడెన్ నేతృత్వంలో "బలహీన ప్రభుత్వం" ఉండటం వల్లనే ప్రపంచంలో యుద్ధాలు, అస్థిరతలు కొనసాగుతున్నాయని డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. అఫ్గనిస్థాన్, ఉక్రెయిన్, ఇజ్రాయిల్ యుద్ధాలను ఆయన ఉదహరించారు. "తాను అధ్యక్షునిగా ఉన్న సమయంలో ప్రపంచంలో యుద్ధాలు లేవు, కల్లోలాలు తలెత్తకుండా నియంత్రించాను, ప్రపంచం శాంతియుతంగా ఉంది" అని ట్రంప్ పేర్కొన్నారు. "అమెరికాను తిరిగి గొప్ప దేశంగా తయారు చేద్దాం" నినాదంతో ట్రంప్ ఎన్నికల ప్రచారం కొనసాగుతున్నది. జో బైడెన్ పరిపాలన బలహీనమైనదనే భావనను ఓటర్ల మనసుల్లో ముద్రించడానికి ట్రంప్ ప్రచార బృందం నిరంతరం గట్టిగా ప్రయత్నిస్తున్నది. తాజాగా ఇజ్రాయిల్‌పై ఇరాన్ చేసిన దాడి ట్రంప్ ప్రచార బృందానికి అయాచితంగా కలిసివచ్చింది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుకు కూడా తన సంకీర్ణ తలనొప్పుల నుంచి ఇరాన్ దాడి ఉపశమనంగా పనికి వచ్చింది. గాజాపై దుర్మార్గాల నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించడానికి కూడా ఈ దాడి ఆయనకు ఉపయోగపడుతుంది!

"ఇజ్రాయిల్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వడం మినహా అమెరికాకు మరో దారిలేదు. ట్రంప్ అయినా, కమలా హారిస్ అయినా అమెరికా వైఖరి ఒకటిగానే ఉంటుంది. అయితే ట్రంప్ తమకు ఎక్కువ సన్నిహితుడని నెతన్యాహు భావిస్తారు. ట్రంప్ గెలవడమే ఇజ్రాయిల్‌కు మంచిదని నెతన్యాహు అనుకుంటారు" అని బీబీసీ ఒక కథనంలో పేర్కొన్నది. గాజా మారణహోమం విషయంలో ట్రంప్ వైఖరికి, కమలా హారిస్ వైఖరికి వ్యత్యాసం ఉంది. పలస్తీనా, లెబనాన్, జోర్డాన్ మూలాలు కలిగిన అమెరికన్ పౌరుల మనోభావాలను డెమొక్రటిక్ పార్టీ పట్టించుకుంటుంది. వారు "ఫ్రీ గాజా" నినాదంతో ఇప్పటికే రోడ్లమీదకు వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు. తాజా యుద్ధం సమస్యని సంక్లిష్టం చేసింది. "ఇరాన్ చేసిన తాజా దాడి కమలా హారిస్‌కు చిక్కులు తేవచ్చు, గాజా గురించిన తన వైఖరిని కమలా హారిస్ గట్టిగా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది" అంటూ

చాలామంది విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఫ్లోరిడా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, జార్జియా, టెన్నెస్సీ, అలబామా రాష్ట్రాలను కుదిపివేసిన భీకర సుడి గాలులు (హరికేన్) తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. ఇప్పటివరకూ సుమారు 190 మంది పౌరులు మృతి చెందినట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరగవచ్చునని అంటున్నారు. ఆస్తినష్టం అపారంగా ఉంది. సమాచారం తెలియగానే సహాయక చర్యలను పర్యవేక్షించడానికి ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ హుటాహుటిన ప్రభావిత ప్రాంతాలకు వెళ్లారు. పునరావాసానికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని ఫెడరల్ ప్రభుత్వం భరిస్తుందని కమలా హారిస్ ప్రకటించారు. సహాయక చర్యల సమయంలో రాజకీయాలు మాట్లాడటానికి కమలా హారిస్‌కు అవకాశం లేదు. కానీ డొనాల్డ్ ట్రంప్ మాత్రం తన ప్రచార ధోరణిని ఏమాత్రం సడలించలేదు. 'కమలా హారిస్ మానసిక వికలాంగురాలు" "జో బైడెన్ ఐక్యు లోపంతో బాధపడుతున్నారు" వంటి మితిమీరిన వ్యాఖ్యలతో మాటల దాడి సాగించారు. సహాయక చర్యల పర్యవేక్షణకు వెళ్లిన కమలా హారిస్‌ను విలేకరులు ట్రంప్ వ్యాఖ్యపై స్పందన కోరగా "గత పదేళ్లుగా ఇలాంటి వ్యాఖ్యలు విని విని విసిగిపోయాను, ఇప్పుడు అవి అవసరమా" అని స్పందించారు. దేశంలో సుమారు యాభై వేలమంది రేవు కార్మికులు సెప్టెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగారు. ఇంటర్నేషనల్ లాంగ్ షోర్‌మెన్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్న కార్మికులు న్యూయార్క్, న్యూ జెర్సీ, మిల్లింగ్టన్ ఓడరేవుల్లో పెద్ద ఎత్తున గుమికూడి నినాదాలు చేస్తున్న దృశ్యాలు టీవీల్లో ప్రసారం అయ్యాయి. తమ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రతకు ముప్పుతెచ్చే యాంత్రీకరణ ప్రతిపాదనలు విరమించాలని కోరుతూ ఏడాదికాలంగా రేవు కార్మికులు ఉద్యమం సాగిస్తున్నారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కారం కాకపోవడంతో చిట్టచివరి ఆయుధంగా సమ్మెలోకి దిగారు. "కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి, కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన వాటా వారికి దక్కాలి, ద్వైపాక్షిక సంప్రదింపుల యంత్రాంగం తనపని తాను చేయాలి" అంటూ అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు.

కమలా హారిస్ అదే తరహాలో ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ట్రంప్ కూడా కార్మికులకు మద్దతు ప్రకటిస్తూ సంప్రదింపుల యంత్రాంగం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. అయితే దానికి రాజకీయ విమర్శను కూడా జోడించడం మరిచిపోలేదు. "కమలా హారిస్ నేతృత్వంలో గత మూడున్నరేళ్లుగా ప్రజల ఆర్థిక స్థితిగతులు ధ్వంసం అయ్యాయి, ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, నిత్యావసర వస్తువులు ధరలు, ఇంటి అద్దెలు పెరిగిపోయాయి, అందుకే కార్మికులు సమ్మెకు దిగారు" అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. రానున్న ఆరేళ్లపాటు తమ వేతన ఒప్పందం అమల్లో ఉంటుంది కావున తమ జీతాలను 77శాతం పెంచాలని రేవు కార్మికులు కోరుతున్నారు. యాభై శాతం వరకూ పెంచడానికి యాజమాన్యాలు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. అది తమకు సమ్మతం కాదని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. అలాగే యాంత్రీకరణ విషయంలో కార్మికులు కోరుతున్న షరతులపై రెండు పక్షాల మధ్య స్థూలమైన ఏకాభిప్రాయం ఉన్నది. కానీ ఒప్పందంలో రాయాల్సిన పారిభాషిక పదజాలం విషయంలో ఇరుపక్షాలు పట్టుదలగా ఉండటంతో అంగీకారం కుదరలేదు. సమ్మె నాలుగోరోజుకు చేరుకోవడంతో దిగుమతులు నిలిచిపోయాయి.

కొన్ని పట్టణాల్లో సరుకుల కొరత వస్తుందన్న అనుమానంతో ప్రజలు నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ఎగబడుతున్నారన్న వార్తలు వచ్చాయి. సెప్టెంబర్ పదో తేదీ నాటి అధ్యక్ష అభ్యర్థుల "అధ్యక్ష చర్చ" తర్వాత ఉపాధ్యక్ష, అభ్యర్థుల డిబేట్ అక్టోబర్ ఒకటో తేదీ రాత్రి జరిగింది. న్యూయార్క్‌లో సీబీఎస్ న్యూస్ చానల్ నిర్వహించిన తొంభై నిముషాల డిబేట్‌లో డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్స్, రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి ఒహియో సెనెటర్ జే.డి. వాన్స్ పాల్గొన్నారు. అధ్యక్ష, అభ్యర్థుల చర్చలో వెల్లువెత్తిన దూషణలు, నిందలు, ఉపాధ్యక్ష అభ్యర్థుల చర్చలో వినిపించలేదు. దాదాపు పదిహేను న్యూస్ నెట్ వర్క్ సంస్థలు ప్రసారం చేసిన ఈ చర్చను నాలుగు కోట్ల ముప్పై ఐదు లక్షలమంది వీక్షించారని నీల్సన్ సంస్థ ప్రకటించింది. ఉపాధ్యక్ష, అభ్యర్థులు ఇద్దరూ పరస్పర గౌరవంతో సభ్యతా సంస్కారాలతో చర్చ చేశారని విశ్లేషకులు ముక్త కంఠంతో అభిప్రాయపడ్డారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కీలక ప్రభావం చూపుతున్న ఇమ్మిగ్రేషన్, అబార్షన్, హెల్త్ కేర్, గన్ వయొలెన్స్, ఇన్ ఫ్లేషన్ , ఫ్యామిలీ కేర్ వంటి అంశాల చుట్టూనే విధానపరమైన చర్చ జరిగింది. అధ్యాపకునిగా ప్రాచుర్యం పొందిన టిమ్ వాల్స్ డెమొక్రటిక్ పార్టీ అనుసరించే మౌలిక విలువలను వివరించే ప్రయత్నం చేశారు. ట్రంప్ కంటే ఎక్కువ ఛాందసవాద వైఖరులతో ప్రాచుర్యం పొందిన రచయిత, నలభై ఏళ్ల జే.డి.వాన్స్ తటస్థులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. పూర్వపు తన వైఖరులనే ఈ చర్చలో మృదువైన భాషలో వివరించారు. తన విధానాలను ట్రంప్ మొరటుగా వ్యక్తం చేయడం ద్వారా ఒక వర్గం ఓటర్లను బాగా ఆకట్టుకుంటారు. నిజానికి ట్రంప్ కంటే ఛాందస అభిప్రాయాలున్న వాన్స్ ఈ చర్చలో తటస్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. "ట్రంప్ కాబోయే అమెరికన్ హిట్లర్" అంటూ ఒకప్పుడు వ్యాఖ్యానించిన జే.డి. వాన్స్ తన పాత మాటను ఈ చర్చలో కొద్దిపాటి మర్యాదతో ఉపసంహరించుకున్నారు. ఇద్దరికీ అన్ని అంశాలలో ఏకాభిప్రాయం ఉండాలని నిబంధనేమీ లేదని కూడా జోడించారు. కుటుంబ విలువలు, స్త్రీల హక్కులు వంటి అంశాలపై రిపబ్లికన్ పార్టీకి ఛాందసవాద అభిప్రాయాలు ఉన్నాయి. తన అమ్మమ్మ, తన అమ్మ, తన భార్య (తెలుగు మూలాలున్న ఉషా చిలుకూరి ఆయన సతీమణి) ప్రస్తావనలు తేవడం ద్వారా వాన్స్ చర్చలో కొంత మృదుత్వాన్ని తీసుకు వచ్చారు. చర్చ ముగిసిన అనంతరం ఇద్దరికీ దాదాపు సమానమైన రేటింగ్స్ వచ్చాయి. ఒకప్పుడు ట్రంప్ కంటే వెనుకబడిన జే.డి. వాన్స్ ఈ చర్చలో కొంత సానుకూల రేటింగ్స్ పొందటం విశేషం. అయితే చర్చ పూర్తయ్యాక జాతీయస్థాయిలో అధ్యక్ష, అభ్యర్థుల సానుకూలత విషయంలో కమలా హారిస్ స్వల్పంగా ముందంజలో కొనసాగుతున్నారు. తొమ్మిది ప్రధాన పోల్ సర్వే సంస్థల సగటు కమలా హారిస్‌కు 49.9 శాతం , డోనాల్డ్ ట్రంప్ కు 45.7 శాతం మద్దతు ఉన్నట్లు తేల్చాయి. అలాగే మరో పదిసర్వే సంస్థల సగటు కమలాహారిస్‌కు 47.8 శాతం, డోనాల్డ్ ట్రంప్‌కు 45.6 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికలకు ఇంకా ముప్పై రోజుల సమయం ఉండటంతో తటస్థుల ఓట్ల కోసం రెండు పక్షాలు హోరాహోరీ తలపడుతున్నాయి!

> **జో బైడెన్ పరిపాలన బలహీనమైనదనే భావనను ఓటర్ల మనసుల్లో ముద్రించడానికి ట్రంప్ ప్రచార బృందం నిరంతరం గట్టిగా ప్రయత్నిస్తున్నది. తాజాగా ఇజ్రాయిల్‌పై ఇరాన్ చేసిన దాడి ట్రంప్ ప్రచార బృందానికి అయాచితంగా కలిసివచ్చింది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుకు కూడా తన సంకీర్ణ తలనొప్పుల నుంచి ఇరాన్ దాడి ఉపశమనంగా పనికి వచ్చింది. గాజాపై దుర్మార్గాల నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించడానికి కూడా ఈ దాడి ఆయనకు ఉపయోగపడుతుంది!**

కులవివక్ష ఇకనైనా అంతమయ్యేనా!

జైళ్లలోనూ కులవివక్షను పాటించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కులం ఆధారంగా జైళ్ల మాన్యుయల్స్(పనుల కేటాయింపు)ను అమలులో వివక్షపాటించడం ఆనవాయితీగా పాటిస్తున్నారు. ఇంతకాలం పాటించిన మాన్యుయల్స్ ఇకపై అమలు చేయరాదని, తక్షణం సవరించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రపాలి ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. జైళ్లలో పనులకేటాయింపు, గదుల కేటాయింపులో కులవివక్ష పాటిస్తున్నారు. ఈ కుల వ్యవస్థ రాజ్యాంగం విరుద్ధమైంది. మూడునెలల్లో ఈ నిబంధనలను సవరించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీన్ని అలాగే కొనసాగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఆయా రాష్ట్రాలు కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా అమలుచేయడానికి సిద్ధమవుతాయా అన్నది పెద్ద ప్రశ్నార్థకమవుతాయి. అలాగే కేంద్రప్రభుత్వం కోర్టు ఆదేశంపైనే ఇంతవరకు స్పందించలేదు. రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలు సైతం ఏమీ మాట్లాడలేదు. వైర్‌కు చెందిన సుకన్యశాంత ప్రజాప్రయోజనాల పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. దీనిపైన అక్టోబరు 3వ తేదీన ధర్మాసనం విచారణచేసి తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జె.బి.పరిద్వాలా, మనోజ్ మిశ్రలు ఉన్నారు. జైలు మాన్యుయల్స్‌ను పట్టించుకోకుండా సర్వసాధారణంగా

ఆదేశాలను జైళ్లలో జారీ చేయడం జరుగుతోంది. ఈ నేరాన్ని ఇకపై కొనసాగనివ్వరాదని సుప్రీంకోర్టు కోరుతోంది. రాష్ట్రాలలో సైతం మాన్యువల్ నిర్వచనాన్ని సవరించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు శ్రద్ధ తీసుకోవాలి. అన్ని రాష్ట్రాలు అవసరమైన మార్పులను చేయాలని సుప్రీం ఆదేశించింది. సుకన్యశాంత రాష్ట్రాలలో పరిస్థితులను తెలుసుకుని ఈ వివక్షను అంతంచేయాలని కోరుతూ పిటిషన్ దాఖలుచేశారు.

ఈ తీర్పును జస్టిస్ చంద్రచూడ్ చదివి వినిపిస్తూ జైళ్లలో ఉన్నవారిలో కులాన్ని ఆధారం చేసుకుని పనులు విభజించరాదని, కులాన్నిపాటిస్తే అది వైరానికి దారితీస్తుందన్నారు. తీర్పును రెండు భాగాలుగా విభజించి ఉత్తర్వు జారీ చేశారు. 1) వలసపాలనకు ముందు లేదా వలసపాలన జరిగే సమయంలోనూ ఉన్నటువంటి నేరచట్టాలను కొనసాగించరాదు. 2) సమానత్వం, గౌరవం కలిగించేందుకు రాజ్యాంగసూత్రాన్ని పాటించాలి. "ఉన్నత కులాలు ఆహారం తయారు చేయాలని, దళితకులాలకు ఆయా ప్రదేశాలను పరిశుభ్రం చేయాలని జైళ్ల మాన్యుయల్స్‌లో ఆదేశించడం ద్వారా వివక్షను పాటిస్తున్నారు. న్యుయల్స్‌లో పరోక్షంగానైనా కులాన్ని ప్రస్తావించడం అందుకు బదులుగా 'నీచమైన', 'అలవాటుపడిన' పదాలను రాయడం ద్వారా కొన్ని గ్రూపులపట్ల వివక్షను పాటిస్తున్నారు అని చంద్రచూడ్ అన్నారు. జైళ్ల మాన్యుయల్స్‌లో వివక్షలను ఆచరిస్తున్నారని సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. "కుల వివక్షను పాటించడం రాజ్యాంగ విరుద్ధమని ఇప్పటికే ప్రకటించారు. అయితే 2024లో పరిశీలించిన జైళ్ల మాన్యుయల్స్‌లోనూ నిర్దిష్టమైన కులాలు ఎలాంటి విధులను నిర్వహించాలనేది రాసే ఉంటుంది. ఉదాహరణకు దళిత ఖైదీలకు నీచమైన పనులను-కేటాయిస్తారు. అదేసమయంలో బ్రాహ్మణ ఖైదీకి వంటచేసే పని అప్పగిస్తారు. రాజస్థాన్ హైకోర్టు కూడా తనంతటతానుగా ఈ కేసు విచారణను స్వీకరించింది. ఈ సమస్యను జాతీయస్థాయిలోనూ పరిష్కరించాలని మేము గుర్తించాము. ఈ అంశంపైన ఒక మార్గాన్ని రూపొందించాలని కోర్టు భావించింది. ఈపనిచేయకపోతే అన్ని రాష్ట్రాలు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించదు" అని శాంత పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాల పిటిషన్ దాఖలుచేసిన శాంత కోర్టు తీర్పుని ఆహ్వానించారు. ఈ సంవత్సరం జులైలో కుల ఆధారిత వివక్షను దేశంలో ఆచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రిత్వశాఖను ఆదేశించాలని సూచనప్రాయంగా భావించినట్లు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. అత్యంత దిగువ కులాలు, జాతులు లక్ష్యంగా చేసుకున్న వివక్ష అంశాలను పిటిషన్‌లో ప్రధానంగా పేర్కొన్నారు. దేశంలోని అన్ని నగరాలు, పెద్దపెద్దపట్టణాలలో డ్రైనేజి కాల్వలను పరిశుభ్రం చేసేవారు సర్వసాధారణంగా దళితులే ఉన్నారు. అలాగే మాంహోల్స్‌లోకి దిగి వాటిని పరిశుభ్రం చేసే సఫాయి కార్మికులంతా దళితులే ఉంటారు. ఈ పనులుచేసేటప్పుడు లోపల ఊపిరాడక చనిపోతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని దీర్ఘకాలంగా సఫాయి కార్మికులు ఉద్యమాలు చేశారు. మాన్‌హెూల్స్‌ను పరిశుభ్రం చేసేందుకు యంత్రాలను ప్రవేశపెట్టిన తర్వాత చాలావరకు ఈ సమస్యను పరిష్కరించినప్పటికీ ఇంకా అనేక ప్రాంతాలలో ఇది కొనసాగుతున్నది. అలాగే మనిషి విసర్జితాన్ని తట్టల్లో తీసుకెళ్లి ఎక్కడో ఓచోట పడేసి తిరిగివచ్చే కార్మికులుసైతం అట్టడుగువారే. ఈ సమస్య మరుగుదొడ్లు వచ్చిన తర్వాత చాలావరకు పరిష్కారమైంది. ఇప్పటికే ఈ ఆచారం ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో, మరికొన్ని రాష్ట్రాల్లో కొనసాగిస్తున్నారు. ఈ ఆచారాన్ని కొనసాగించకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.

ఎడిట్ పేజి డెస్క్

పవన్ వ్యాఖ్యలపై డీఎంకే మండిపాటు

న్యూఢిల్లీ: తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను డీఎంకే తప్పుపట్టింది. తమ పార్టీ ఏ మతం గురించి, ప్రత్యేకంగా హిందూ మతం గురించి ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని డీఎంకే అధికార ప్రతినిధి డా.సయ్యద్ హఫీజుల్లా శుక్రవారం పేర్కొన్నారు. కులం పేరుతో జరిగే దౌర్జన్యాలు, అంటరానితనం, కుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మాట్లాడటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 'పవన్ కల్యాణ్, చంద్రబాబునాయుడు, వారి పార్టీలు టీడీపీ, జనసేన, ఆ పార్టీల మిత్రపక్షం బీజేపీ హిందూమతం, మానవత్వానికి నిజమైన శత్రువులు' అని ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ దేవతలు, మతాన్ని వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ ప్రకటన ఉద్దేశం... వారి విధానాల వల్ల ప్రభావితమైన కోట్లాది మంది ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నమేనని విమర్శించారు. అంబేద్కర్, జ్యోతిరావ్‌పూలే, పెరియార్, ఇతర ద్రవిడ ఉద్యమకారుల కులం, అంటరానితనంపై చేపట్టిన పోరాటమే తమ పార్టీ వైఖరి అని అన్నారు.

సీఎం నివాసం ఖాళీ చేసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: సీఎం నివాసాన్ని ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఖాళీ చేశారు. సివిల్ లైన్స్ ఏరియాలో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని ఆ ఇంటి నుంచి శుక్రవారం తన కుటుంబంతో కలిసి బయటకు వచ్చారు. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆప్ పార్టీ కేంద్ర కార్యాలయం సమీపంలోని బంగ్లాలో ఆయన నివాసం ఉండనున్నారు. పంజాబ్‌కు చెందిన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు అధికారికంగా కేటాయించిన ఆ భవనం... ఫిరోజ్‌షా రోడ్డులో ఉంది. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని... జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలైన అరవింద్ కేజ్రీవాల్... సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆతిశీ నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టారు. దాంతో సీఎం నివాసాన్ని ఖాళీ చేయనున్నట్టు ఇటీవల పార్టీ కార్యకర్తలకు కేజ్రీవాల్ వెల్లడించారు. తమ ఇంటికి రావాలని, తమతో ఉండిపోవాలని కొంతమంది చట్టసభ సభ్యులు, కార్యకర్తలు ఆయనను కోరారు. 2013లో తొలిసారిగా సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఆయన తిలక్ లేన్‌లో ఉండేవారు. 2015లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఇంటికి మారారు.

నిరుద్యోగాన్ని రుగ్మతగా మార్చారు

బీజేపీపై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ: హర్యానాలో ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం విమర్శించారు. రాష్ట్ర ప్రజలు త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'కుటిల పెట్టుబడిదారుల' 'చక్రవ్యూహం' ను విచ్ఛిన్నం చేస్తారని అన్నారు. బీజేపీ 'నిరుద్యోగ వ్యాధిని' వ్యాపింపజేసిందని, దీంతో రాష్ట్ర యువత భవిష్యత్ ప్రమాదంలో పడిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధి కల్పించేలా, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండేలా చూస్తుందని తెలిపారు. ఇటీవల తన విజయ్ సంకల్ప్ యాత్ర సమయంలో మహిళా గ్రూపుతో తాను జరిపిన సంభాషణ వీడియోను గాంధీ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 'హర్యానాకు చెందిన కొంతమంది సోదరీమణులు విజయ్ సంకల్ప్ యాత్రలో ఆశ్రయం ఇచ్చారు. చాలా ప్రేమతో ఇంట్లో రోటీలు తినిపించారు. రాష్ట్ర సంక్లిష్ట సమస్యలను కూడా వివరించారు' అని గాంధీ చెప్పారు. నేడు హర్యానాలో భారతదేశంలోనే అత్యధిక నిరుద్యోగం ఉందని ఆయన అన్నారు. 'దీనికి కారణం బీజేపీ దశాబ్ద కాలంలో రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించే ప్రతి వ్యవస్థ వెన్ను విరిచేసిందని' ఆరోపించారు. అలాగే లోపభూయిష్టమైన జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దుతో బీజేపీ చిన్న వ్యాపారాల వెన్ను కూడా విరిచిందని, ఇది అగ్నివీర్‌తో సైన్యానికి సిద్ధమవుతున్న యువత స్ఫూర్తిని దెబ్బతీసిందని మండిపడ్డారు. నల్ల చట్టాలతో వ్యవసాయం చేస్తున్న రైతుల ధైర్యాన్ని విచ్ఛిన్నం చేసిందని, మరోవైపు వారి మద్దతును లాక్కోవడం ద్వారా క్రీడాకారుల కలలను భగ్నం చేసిందని గాంధీ ఆరోపించారు. 'పరివార్ పెహచాన్ పత్ర' తో ప్రభుత్వ నియామకాలను నిలిపివేయడం ద్వారా కుటుంబాలను విచ్ఛిన్నం చేశారన్నారు. దీని ఫలితం : డ్రగ్స్ బారిన పడి యువత ప్రతిభ వృథా అవుతోంది. నిరాశ చెందిన యువత నేరాల బాట పడుతోంది. డుంకీ లాంటి ప్రమాదాల ప్రయాణంతో కుటుంబాలు నాశనమవుతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తుందని, హర్యానాను మాదకద్రవాల రహిత రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. 'హర్యానా సోదరీమణులకు ఈ వినాశనాన్ని ఆపుతానని, వారి పిల్లలను రక్షిస్తానని, ఉపాధి తిరిగి వస్తుందని, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉంటుందని నేను వాగ్దానం చేశాను' అని గాంధీ చెప్పారు. 'ఎక్స్'లో మరొక పోస్ట్‌లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, తాను ఇటీవల గోహనాలో రుచికరమైన జిలేబీలు, వాటిని మరింత విస్తృతంగా విక్రయించే అవకాశం గురించి మాట్లాడానని గుర్తు చేసుకున్నారు. భారతదేశంలో ఇలాంటి చిన్న ఉత్పత్తిదారుల 5,500 క్లస్టర్లు ఉన్నాయని, వారికి సరైన మద్దతు ఇస్తే ప్రపంచానికి తమ ఉత్పత్తులను మార్కెట్ చేయగలరని ఆయన అన్నారు. వారికి ఆర్థిక, సాంకేతికత, నెట్‌వర్క్‌లు, బ్రాండింగ్, మెరుగైన సంస్థను అందించడానికి విధానాలు అవసరమని గాంధీ నొక్కి చెప్పారు. భారతదేశానికి ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే వేగవంతమైన ఆర్థిక వృద్ధి, ప్రపంచ వేదికపై పోటీపడే మరింత ఉత్పాదక ఆర్థిక వ్యవస్థ అవసరమని అన్నారు. 'మోదీజీ చేసిన కొన్ని కుటిల కంపెనీలపై దృష్టి పెట్టడం కంటే మన చిన్న వ్యాపారాలకు సాధికారత కల్పించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది' అని ఆయన అన్నారు. యువత, విద్యావంతులు, శక్తివంతమైన యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి, వారి భవిష్యత్‌ను సురక్షితంగా ఉంచడానికి భారతదేశానికి అవసరమైన కోట్లాది అధికారిక ఉద్యోగాలను సృష్టించడానికి ఇటువంటి సమ్మిళిత వృద్ధి ఏకైక మార్గం' అని పేర్కొన్నారు. 'బీజేపీ హర్యానా, భారతదేశంలో ఆర్థిక వ్యవస్థను విఫలం చేసింది. వారు కోట్లాది మందిని అనధికారిక ఉద్యోగాలలోకి నెట్టారు. చిన్న వ్యాపారాలను నాశనం చేయడం ద్వారా లక్షల మందిని భారతదేశం వదిలి వెళ్లేలా చేశారు. వారి ఏకైక ఆసక్తి అదానీ ద్వారా భారీగా ఉత్పత్తి చేయబడే ఉత్పత్తులపై మాత్రమే!' అని గాంధీ విమర్శించారు. 'హర్యానా ప్రజలు ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకున్నారు. మోదీజీ కుటిల పెట్టుబడిదారులకు చెందిన 'చక్రవ్యూహాన్ని' విచ్ఛిన్నం చేయడానికి వారు త్వరలో తదుపరి దెబ్బ వేస్తారు' అని ఆయన అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు శనివారం పోలింగ్ జరగనుండగా, అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఎంసీడీ ఎన్నికలపై మీ జోక్యమేది?

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సుప్రీంకోర్టు మొట్టికాయ

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ స్థాయీసంఘంలోని చివరి సీటు కోసం ఎన్నిక జరిపించేందుకు అంత తొందర ఎందుకని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి సంబంధించిన ఛైర్మన్ ఎన్నిక నిర్వహణపైనా స్టే విధించింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహాదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. 'నామినేషన్ అంశం కూడా ఉంది... దానిని పర్యవేక్షించేందుకు అక్కడ మేయర్ ఉన్నారు. మీకు అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇలా జోక్యం చేసుకొంటూ పోతే ప్రజాస్వామ్యం ఏమైపోతుంది. దీనిలో కూడా రాజకీయాలా?' అని లెఫ్టినెంట్ గవర్నర్‌ను న్యాయమూర్తులు నిలదీశారు. అనంతరం బీజేపీకి చెందిన సుందర్ సింగ్ తన్వర్‌ను కమిటీలోకి ఎన్నుకోవడంపై మేయర్ షెల్లీ ఓబ్రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని ఎల్జీని ధర్మాసనం ఆదేశించింది. మరోవైపు ఆప్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం స్పందించింది. 'ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించవద్దు. రెండు వారాల తర్వాత చూడండి' అని సూచించింది. ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ) స్థాయీ సంఘంలో ఖాళీగా ఉన్న ఆరోస్థానం కోసం గత నెల నిర్వహించ తలపెట్టిన ఎన్నికలో చివరి క్షణాన లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనా జోక్యంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు జరిగిన ఎంసీడీ సమావేశంలో కౌన్సిలర్లను తనిఖీ చేశారన్న కారణంగా తలెత్తిన గందరగోళం మధ్య స్థాయీసంఘం ఎన్నికను మేయర్ షెల్లీ ఓబెరాయ్ అక్టోబరు 5వ తేదీకి వాయిదా వేశారు.

సరిహద్దులో శరవేగంగా చైనా నిర్మాణాలు

వాయుసేన

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ వెంబడి చైనా శరవేగంగా మౌలిక వసతులు, నిర్మాణాలు చేపడుతోందని వాయుసేన అధిపతి, ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శుక్రవారం వెల్లడించారు. భారత్ కూడా అదే స్థాయిలో వేగంగా సరిహద్దుల వద్ద సౌకర్యాలు పెంపొందిస్తోందన్నారు. దళాల వద్ద దేశీయ తయారీ ఆయుధ వ్యవస్థలు ఉండటం చాలా ముఖ్యమని సింగ్ అన్నారు. 2047 నాటికి భారత దళాల వద్ద పూర్తిగా దేశీయ ఆయుధాలే ఉండాలని ఎయిర్ మార్షల్ సింగ్ సూచించారు. వైమానిక దినోత్సవం రానున్న తరుణంలో ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో అనేక అంశాలను వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధాలను దృష్టిలోపెట్టుకొని భవిష్యత్తు సవాళ్లు ఎదుర్కోవాలంటే దేశీయ ఆయుధాలు ఉండటం ముఖ్యమని సింగ్ చెప్పారు. ఇప్పటికే రష్యా నుంచి మూడు యూనిట్ల ఎస్-400 వ్యవస్థలు దిగుమతి అయ్యాయని, వచ్చే ఏడాది మిగిలినవాటిని కూడా అందజేస్తామని మాస్కో చెప్పినట్లు ఏపీ సింగ్ వెల్లడించారు. 114 మల్టీరోల్ ఫైటర్ జెట్ల కొనుగోళ్లపై స్పందిస్తూ.. 'మనం ఏ మార్గంలో కొనాలన్నది నిర్ణయించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మనం 114 విమానాల కోసం డీఏపీ-2020 అంశాన్ని చూస్తున్నాం. కానీ, వాటిని దేశీయంగా తయారుచేస్తే బాగుంటుందని భావిస్తున్నాం. వాయుసేన 2047 నాటికి పూర్తిగా దేశీయ ఆయుధాలతోనే ఉండాలి. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణి కుష వంటి వాటిని ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాం. మనవద్ద పెద్దసంఖ్యలో ఆకాశ్ క్షిపణులు ఉన్నాయి. ఇప్పుడు ఆకాశ్ ఎన్‌జీ కోసం చూస్తున్నాం. మీరు బయటి వాటికోసం ఆధారపడితే... ఎప్పుడైనా అవి ఇబ్బంది పెట్టొచ్చు. యుద్ధం చేయాలంటే కనీసం 200 నుంచి 300 క్షిపణులు ప్రయోగించాల్సి ఉంటుంది. అందుకే వాటిని దేశీయంగా తయారు చేసుకోవడం మంచిది. ఇప్పటికే తేజస్‌లో జాప్యం జరిగిన విషయం మీకు తెలుసు. మనం ఏటా 24 విమానాలను ఉత్పత్తి చేయగలిగితే... దానిని నివారించవచ్చు. మనం ప్రైవేటు సంస్థల వైపు మళ్లాల్సిన అవసరం ఉంది. హెచ్‌ఏఎల్‌కు కూడా పరిమితులున్నాయి. ఉత్పత్తిలో సవాళ్లను ఎదుర్కోవాలంటే ప్రైవేటు రంగం అవసరం చాలా ఉంది' అని సింగ్ వెల్లడించారు. ఇప్పటివరకు తూర్పు లద్దాఖ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సెంట్రల్ సెక్టార్‌లో ఎయిర్ ఫీల్డ్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

మీడియాపై మోదీ సర్కార్ నిఘా

- పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేత
- సీనియర్ జర్నలిస్టుల విమర్శ

న్యూఢిల్లీ: మీడియా హక్కులను మోదీ సర్కార్ కాలరాస్తోందని సీనియర్ జర్నలిస్టులు విమర్శించారు. మీడియాపై మోదీ ప్రభుత్వం నిఘా పెంచిందని చెప్పారు. మీడియా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే మోదీ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పురకాయస్థను అరెస్టు చేసి ఏడాది పూర్తైన సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో స్వతంత్ర జర్నలిజంపై దాడిని ఖండిస్తూ డీయూజే, పీసీఐ, ఐడబ్ల్యూపీసీ, ప్రెస్ అసోసియేషన్, కేయూడబ్ల్యూజే సంయుక్త అధ్వర్యంలో నిరసన సభ జరిగింది. సుజాత మధోక్ అధ్యక్షత వహించారు. 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌కు సంబంధించి పురకాయస్థ అరెస్ట్, ప్రొసీడింగ్స్‌ను పాటించకుండా మీడియాపై మోదీ ప్రభుత్వం ప్రధాన దృష్టి కేంద్రీకరించిందని 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ్ వరదరాజన్ అన్నారు. 2017లో ఎన్డీటీవీ ప్రమోటర్లపై సీబీఐ కేసుతో మోదీ ప్రభుత్వం స్పష్టంగా మీడియా వేట ప్రారంభించిందని తెలిపారు. కేంద్ర విధానాలపై విమర్శించే సాహసం చేసిన ఏకైక జాతీయ ఛానల్ ఎన్డీటీవీ మాత్రమే అని అన్నారు. ఎన్డీటీవీని అదానీ తన సొంతం చేసుకున్న తరువాత సీబీఐ కేసు మూసివేసిందని ఆయన తెలిపారు. దారుణ సెక్షన్లతో కూడిన ప్రసార బిల్లును కేంద్రం ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నప్పటికీ... దానిని తిరిగి తీసుకురావడానికి ఇంకా అవకాశం ఉందని అన్నారు. 'న్యూస్‌క్లిక్'లో ఢిల్లీ పోలీసులు జరిపిన దాడిలో స్వాధీనం చేసుకున్న వందలాది ఎలక్ట్రానిక్ వస్తువులను తిరిగి ఇవ్వలేదని న్యూస్ క్లిక్ వ్యవస్థాపక చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ అన్నారు. న్యూస్‌క్లిక్‌కు సహకరించిన వారి పరిశోధనా పత్రాలు పోలీసుల వద్ద ఉన్నాయని, ఆదాయపన్ను శాఖ చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సామాన్య ప్రజల నుంచి వస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్ట్ నీలు వ్యాస్ థామస్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఏజెన్సీల వేధింపులు జర్నలిస్టుల కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రముఖ పాత్రికేయులు ఎన్.రామ్, పి.సాయినాథ్ వీడియో సందేశం పంపారు. ఈ కార్యక్రమంలో టీకే రాజలక్ష్మి, ఎస్‌కే పాండే, జైశంకర్, ధనసుమోద్ తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ నిర్వాకంతో యుద్ధభూమికి భారతీయులు

మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధంలో ఇజ్రాయిల్‌లో దాదాపు 15 వేల మంది భారతీయ కార్మికుల నియామకానికి మోదీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సహకారం సులభతరం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి వెళ్లినందుకు భారతీయ యువత ఏజెంట్ల చేతిలో మోసపోవడంతో పాటు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాల వల్ల నిరుద్యోగం ఏర్పడినట్లు ఇది తేటతెల్లం చేస్తోందని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. నైపుణ్యం లేని, సెమీ స్కిల్డ్, విద్యావంతులైన యువతీయువకులు తమ ప్రాణాలు పణంగా పెట్టి, అధిక జీతాలతో యుద్ధంలో ఉన్న దేశాలలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారనే వాస్తవం... ఉద్యోగాలపై ప్రధాని మోదీ చేసే గొప్ప వాదనలు... తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బూటకపు మాటలు తప్ప మరొకటి కాదని అన్నారు. ఈ సంఘర్షణ ప్రాంతాలలో ఉద్యోగాల కోసం ఒత్తిడికి గురవుతున్న హర్యానా యువత రేపు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌లో దాదాపు 15 వేల మంది భారతీయ ఉద్యోగుల నియామకానికి మోదీ ప్రభుత్వ జాతీయ నైపుణ్యాభివృద్ధి సహకారం ఏదీ తక్కువ కాదు' అని ఆయన ఎద్దేవా చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణలో విఫలం

యోగి ప్రభుత్వంపై విపక్షం ధ్వజం

లక్నో: అమేఠీలో ఒక దళిత కుటుంబానికి చెందిన నలుగురు హత్యకు గురైన ఘటన నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని ప్రతిపక్షం శుక్రవారం బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. అమేఠీలోని అహోర్వా భవాని ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సునీల్ కుమార్ (35), అతని 32 ఏళ్ల భార్య పూనమ్, వారి కుమార్తెలు దృష్టి, సునీలు శుక్రవారం కాల్చి చంపబడ్డారు. దళిత కుటుంబాన్ని దారుణంగా హత్య చేసిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. 'యూపీలోని అమేథీ జిల్లాలో దళిత కుటుంబానికి చెందిన నలుగురిని దారుణంగా హత్య చేసిన సంఘటన చాలా బాధాకరం. ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం దోషులు, అక్కడి పోలీసులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి' అని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి 'ఎక్స్' పై హిందీలో పేర్కొన్నారు. యోగి ప్రభుత్వ పాలనలో శాంతిభద్రతలు సరిగా లేవని, ఇంట్లో కూడా ఒక వ్యక్తి సురక్షితంగా లేడని ఈ సంఘటన తెలియజేస్తోందని కాంగ్రెస్ యూపీ అధ్యక్షుడు అజయ్ రాయ్ అన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన ధ్వంసమైందని, యూపీలో గూండాలు, దుర్మార్గులు, నేరగాళ్ల భీభత్సం కొనసాగుతోందని రాయ్ అన్నారు. దీనికి యోగి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు స్వామి ప్రసాద్ మౌర్య ఖండించారు. ఉత్తరప్రదేశ్‌లో జంగిల్ రాజ్ తప్ప చట్టబద్ధత లేదని అమేథీ ఘటన చెబుతోందని ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం విచారం వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ గురువారం సాయంత్రం సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా శాంతిభద్రతల పరిస్థితిపై బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. 'కోయి హై? కహీన్ హై? (ఎవరైనా ఉన్నారా? ఎవరైనా ఎక్కడైనా ఉన్నారా?)' ఘటనకు సంబంధించిన వార్తా కథనాన్ని పంచుకున్నారు. అమేథీకి చెందిన కాంగ్రెస్ ఎంపీ కిశోరీ లాల్ శర్మ కూడా ఈ హత్యలపై ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

డ్రగ్స్ రాకెట్‌లో కాంగ్రెస్ హస్తం: అమిత్‌షా

న్యూఢిల్లీ: ఢిల్లీలో వేలాది కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయింది. ఈ రాకెట్‌లో తుషార్ గోయల్ పేరు ప్రముఖంగా వినిపించింది. దీనికి సంబంధించి కాంగ్రెస్‌పై బీజేపీ అగ్రనేత అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ డ్రగ్స్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ఒకపక్క 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా' కోసం మోదీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఉత్తర భారత్‌లో పట్టుబడిన డ్రగ్స్‌లో కాంగ్రెస్ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటు. ప్రమాదకరం. కాంగ్రెస్ పాలనలో పంజాబ్, హర్యానా, మొత్తం ఉత్తర భారతంలోని యువత ఈ మాదకద్రవ్యాల వల్ల ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో చూశాం. ఒకవైపు యువతను క్రీడలు, ఆవిష్కరణలు, విద్యవైపు మోదీ ప్రోత్సహిస్తుంటే... వారిని కాంగ్రెస్ డ్రగ్స్ ప్రపంచం వైపు మళ్లించాలని అనుకుంటోంది. డ్రగ్ డీలర్ల రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా ఆ నెట్‌వర్క్ ఎక్కడున్నా మోదీ ప్రభుత్వం పెకిలించి వేస్తుంది' అని ఎక్స్ వేదికగా అమిత్ షా పేర్కొన్నారు.

యూజీసీ నెట్ ఫలితాలపై విద్యార్థుల ఆందోళన

'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ: యూజీసీ నెట్ (జూన్ సెషన్) ఫలితాల కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఈ పరీక్ష జరిగి నెల రోజులైనా ఇంకా ఫలితాలు విడుదల చేయకపోవడంతో ఎన్‌టీఏ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 వరకు 83 సబ్జెక్టులకు యూజీసీ నెట్ పరీక్ష నిర్వహించగా... దాదాపు 9లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. సాధారణంగా యూజీసీ నెట్ పరీక్ష జరిగిన తర్వాత ఫలితాలను నెల రోజుల్లోపే ప్రకటిస్తుంటారు. కానీ జూన్ సెషన్ పరీక్షా ఫలితాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడంపై అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో తమ ఆందోళన వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ ఫలితాల్లో జాప్యం జరగడంతో విద్యార్థులు, టీచర్లు ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారని, దీనిపై యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నిస్తున్నారు. "రోజూ ఉదయాన్నే కొత్త ఆశలతో మేల్కొంటాం. కానీ, యూజీసీ నెట్ ఫలితాలు మాత్రం ఇంకా రాలేదు. మా కలలు, కష్టం ప్రమాదంలో ఉన్నాయి. యూజీసీ మా పరిస్థితిని అర్థం చేసుకోవాలి' అని ఒకరు పోస్టు పెట్టగా... 'యూజీసీ నెట్ ఫలితాలపై మౌనం వహించడం సరికాదు.. వేచి చూసి అలసిపోయాం' అని యూజీసీ ఛైర్మన్‌ను ఉద్దేశించి మరొకరు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'జూన్‌లో జరిగిన యూజీసీ నెట్ పరీక్ష రద్దయింది. ఆ తర్వాత దాదాపు మూడు నెలలకు రీషెడ్యూల్ చేసింది. ఇప్పుడు ఫలితాలనూ ఆలస్యం చేస్తోంది... ఎంత బాధ్యతారాహిత్యం? విద్యార్థులు జూన్ నుంచి ఒత్తిడిలో ఉన్నారు. ఇది అన్యాయం' అని ఇంకొకరు రాశారు. 'ఎన్‌టీఏ యూజీసీ నెట్ ప్రాథమిక కీని సెప్టెంబర్ 7న విడుదల చేసింది. 14వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించింది. మామూలుగా, అభ్యంతరాల స్వీకరణ ముగిసిన తర్వాత ఏడు లేదా పది రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తారు. కానీ ఈసారి ఎందుకు జాప్యం జరుగుతోంది? త్వరగా ఫలితాలు విడుదల చేసి అభ్యర్థుల మానసిక వేదనకు ముగింపు పలకండి' అని మరో విద్యార్థి ట్వీట్ చేశారు.

రిజర్వేషన్లపై పరిమితి వద్దు

కేంద్రానికి శరద్ పవార్ సూచన

ముంబై: మహారాష్ట్రలో విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచేందుకు రాజ్యాంగ సవరణ తీసుకురావాలని ఎన్సీపీ (ఎస్పీ) నేత శరద్ పవార్ శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోటా కోసం ఉద్యమిస్తున్న మరాఠాలకు రిజర్వేషన్లు మంజూరుచేసే సమయంలో ఇతరవర్గాల రిజర్వేషన్లకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రిజర్వేషన్లపై పరిమితి 50 శాతం ఉందన్నారు. కాగా తమిళనాడులో 78 శాతం (వివిధ వర్గాలకు కోటా) ఉంటే, మహారాష్ట్రలో 75 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ కూడా కోటా పరిమితిని పెంచేందుకు కేంద్రం రాజ్యాంగ సవరణను తీసుకువస్తే దానిని తాము స్వాగతిస్తామని శరద్‌పవార్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కూటమి మహావికాస్ అఘాడి(ఎంవీఏ) నేతల మధ్య సీట్ల పంపకంపై చర్చలు వచ్చేవారం కూడా కొనసాగుతాయన్నారు. వీలైనంత త్వరగా చర్చలు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రభుత్వంలో మార్పు తీసుకురావడానికి ప్రజలు సానుకూలంగా ఉన్నారని, తాము వారి మనోభావాలను గౌరవిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాకర్షక పథకాలతో వరాల జల్లు కురిపిస్తూనే ఇతర కార్యక్రమాలకు రావాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ, శివసేన (శిండే), ఎన్సీపీ (అజిత్ పవార్)లతో కూడిన మహాయుతి అధికారంలో ఉంది. ఎంవీఎం భాగస్వామ్య పార్టీలైన ఎన్సీపీ, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ), కాంగ్రెస్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసి... రాష్ట్రంలో 48 స్థానాలకు 30 స్థానాలు గెలుచుకున్నాయి. కాగా, నవంబరులో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. విపక్షాలు చాలాసార్లు తనకు ప్రధానమంత్రి కుర్చీని ఆఫర్ చేశాయని నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలను పవార్ కొట్టిపడేశారు. తాము అలాంటి ఆఫర్లేమీ చేయలేదని... పార్టీలో అవసరమైనంతమంది ఎమ్మెల్యేలే లేనప్పుడు అలాంటి ఆఫర్ ఎలా చేస్తామని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ ఇప్పటికే సార్వత్రిక సమరం కోసం భారీ హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేసింది. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం పరిమితిని పెంచేలా రాజ్యాంగ సవరణ చేపడతామని హామీ ఇచ్చింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) అందించే 10 శాతం కోటాను అన్ని కులాలు, వర్గాల వారికి ఎలాంటి వివక్ష లేకుండా అమలుచేస్తామని తెలిపింది.

ఎన్సీపీలో చేరుతున్నా: బీజేపీ నేత పాటిల్



ముంబై: బీజేపీ నేత, మాజీ మంత్రి హర్షవర్ధన్ పాటిల్ శుక్రవారం కీలక ప్రకటన చేస్తూ... తాను శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరుతానని తెలిపారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన మద్దతుదారులతో సమావేశమైన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం హర్షవర్ధన్ మీడియాతో మాట్లాడారు. 'నేను గత రెండు నెలలుగా ఇందాపూర్ నియోజకవర్గం అంతటా పర్యటిస్తూ వివిధ వర్గాల ప్రజలను కలుస్తున్నా. ఒక విషయం స్పష్టంగా ఉంది. తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజలు పట్టుబడుతున్నారు' అని అన్నారు. కాగా, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌తో తాను సమావేశమైనట్లు హర్షవర్ధన్ పాటిల్ తెలిపారు. తన మద్దతుదారులతో మాట్లాడిన తర్వాత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్సీపీ ఎమ్మెల్యే దత్తమామ భర్నేపై పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబరు ఏడో తేదీన పూణె జిల్లాలోని ఇందాపూర్‌లో జరిగే భారీ ర్యాలీలో ఎన్సీపీ (ఎస్పీ)లో ఆయన చేరుతారని మద్దతుదారులు తెలిపారు. మరోవైపు ఇందాపూర్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన హర్షవర్ధన్ పాటిల్, ప్రస్తుతం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఛైర్మన్, కోఆపరేటివ్ బ్యారన్‌గా ఉన్నారు.

వైఎస్ఆర్ జిల్లా పేరు మార్చండి

చంద్రబాబుకు సత్యకుమార్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వం కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చిందని, దీనిని వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్చి గెజిట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును మంత్రి సత్యకుమార్ కోరారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ రాశారు. కలియుగ దైవం వేంకటేశ్వరుడి సన్నిధికి చేరడానికి తొలిగడప కడప అని, కడప పేరుకు ఒక చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్నాయన్నారు. వీటిపై అవగాహన లేని మాజీ సీఎం వైఎస్ జగన్... కడప జిల్లాకు 'వైఎస్ఆర్' పేరు పెట్టడం తగదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కడప జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కడప ప్రజల మనోభావాల దృష్ట్యా జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని ముఖ్యమంత్రిని సత్యకుమార్ కోరారు.

పౌర న్యాయ వ్యవస్థలో సంస్కరణలు

కుల వివక్షపై సుప్రీం తీర్పు హర్షణీయం: డి.రాజా

న్యూదిల్లీ: జైళ్లల్లో కుల విచక్షణ రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా స్వాగతించారు. పౌర న్యాయ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలను డిమాండ్ చేశారు. పోలీసులు, జైళ్లు, న్యాయ వ్యవస్థలోని పరిస్థితులను సమీక్షించేందుకు తాజా తీర్పు అవకాశం కల్పించిందని శుక్రవారం వెలువరించిన ప్రకటనలో రాజా అభిప్రాయపడ్డారు. జైళ్లు, పోలీసు, న్యాయపరమైన సంస్కరణలను చేపట్టాలని సీపీఐ నొక్కి చెబుతోందని తెలిపారు. సీపీఐ నాయకుడు ఇంద్రజిత్ గుప్తా కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు దేశ పౌర న్యాయ వ్యవస్థను ప్రజాస్వామిక నిబంధనలకు అనువైనదిగా, మానవతా దృక్పథంతో ఉండేదిగా సంస్కరించేందుకు యత్నించారని గుర్తుచేశారు. వివక్షకు తావులేకుండా పౌర న్యాయ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టడానికి కట్టుబడాలని పాలకులకు సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేలా హామీ నివ్వడం ద్వారా సామాజిక న్యాయం సాధించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. 'జైళ్ల రిజిస్టర్ల నుంచి కులం అనే కాలమ్‌నే తొలగించాలని, కుల వివక్ష రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇది ఎప్పుడో జరగాల్సింది. ఆలశ్యమైనప్పటికీ స్వాగతించదగినది' అని ప్రకటనలో రాజా వెల్లడించారు. కుల వివక్ష భయానక రూపం కేవలం రిజిస్టర్లకు పరిమితం కాదని అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కుల రక్కసి తలను తెగనరకడంతో సామాజిక అభ్యున్నతికి మార్గం సుగమం కాగలదని నొక్కిచెప్పారు. జైళ్లల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఖైదీలతో టాయిలెట్లు శుభ్రం చేయించడం... అగ్రవర్ణాల వారికి గౌరవప్రదంగా వంటశాలల్లో పని ఇవ్వడం ద్వారా కుల వివక్ష ప్రదర్శిస్తుండటాన్ని ఆక్షేపిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం హర్షణీయమని రాజా పేర్కొన్నారు.

సుప్రీం మార్గదర్శకాలు తప్పక ఆచరించాలి: సీపీఎం

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అన్ని ప్రభుత్వాలు తప్పక ఆచరించాలని, నిర్దేశిత మూడు నెలల గడువులోగా జైళ్లల్లో కుల వివక్ష లేకుండా చేయాలని సీపీఎం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. జైళ్లల్లో కుల వివక్షను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ దాని అంతాన్ని సూచిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తంచేసింది. నిమ్న వర్గాలకూ గౌరవంగా జీవించే హక్కును ఈ తీర్పు కల్పిస్తుందని ఆకాంక్షించింది. కుల వివక్షను ప్రోత్సహించే చట్టాలు, నిబంధనలను రద్దు చేయాలని, జైళ్లల్లో కుల వివక్షకు అంతం పలకాలని డిమాండ్ చేసింది.

డేరా బాబాకు పెరోల్ ఎన్నిసార్లు?

సీపీఐ కార్యదర్శి నారాయణ ప్రశ్న



న్యూదిల్లీ: హర్యానా ఎన్నికల వేళ వివాదాస్పద దేరా బాబుకు పెరోల్ లభించడాన్ని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆక్షేపించారు. జర్నలిస్టు హత్య, ఆశ్రమంలోని మహిళలపై అత్యాచారాల కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వ్యక్తికి ఎన్నికలప్పుడు 20 రోజుల పెరోల్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 259 రోజుల్లో పెరోల్ ఎన్ని సార్లు ఇస్తారని నిలదీశారు. ఇతను పెరోల్‌కు అర్హుడైతే ... ఏళ్ల తరబడి బెయిల్‌కు నోచుకోని వేలాది మంది ఖైదీలు పెరోల్‌కు ఎందుకు అర్హులు కారని నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రతి పౌరుడికి సమానమైన హక్కులు ఉన్నాయని, ఎవరినీ తక్కువ చేయలేమని... ఎవరికీ హక్కులను నిరాకరించలేమన్నారు. ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గుతున్న ఖైదీలకు పెరోల్ ఇవ్వనప్పుడు... డేరా బాబాకు పదేపదే పెరోల్ ఇవ్వడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. ఈ వైఖరి న్యాయ వ్యవస్థను అవహేళన చేస్తున్నట్లుగా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తేలికగా తీసుకోవాల్సిన విషయం కాదని, సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి డేరా బాబాకు మంజూరైన పెరోల్‌ను రద్దు చేయాలని, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆదేశాలివ్వాలని నారాయణ కోరారు.

ఎస్సీల ఉపవర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటిషన్ల కొట్టివేత

న్యూదిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ ఆమోదిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఉప వర్గీకరణకు సర్వోన్నత న్యాయస్థానం ఆమోదముద్ర వేసింది. ఈ తీర్పును సమీక్షించాలంటూ 10 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిగింది. 'పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. తీర్పును సమీక్షించాల్సిన పరిస్థితులు కనిపించలేదు. అందుకే వాటిని కొట్టివేస్తున్నాం' అని కోర్టు పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లలో 50 శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అలాంటి ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్-హర్యానా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. దానిని సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఇందులో ఒక పిటిషనర్‌గా ఉన్నారు. పిటిషన్లు విచారించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం... 2020లో దీనిని ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దీని విచారణను చేపట్టి... 6:1 ఆధిక్యంతో తీర్పు వెలువరించింది. ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించి అదే వర్గంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టంచేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని స్పష్టంచేసింది. వెనుకబాటుతనం పేరుతో 100 శాతం రిజర్వేషన్లను ఒకే ఉప వర్గానికి (సబ్ గ్రూప్‌నకు) ధారాదత్తం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని పేర్కొంది. 15(4), 16(4) అధికరణాల కిందికి వచ్చే అన్ని వర్గాలకూ ఆ ప్రయోజనాన్ని కల్పించాలని చెప్పింది.

వారంలో రాజధాని అసైన్డ్ రైతులకు కౌలు

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్

విశాలాంధ్ర-తుళ్లూరు: రాజధాని అమరావతిలోని అసైన్డ్ రైతుల ఖాతాలోకి వారంలోగా కౌలు సొమ్ము జమ చేస్తామని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ చెప్పారు. శుక్రవారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డే జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ అధ్వర్యంలో అసైన్డ్ రైతులు సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కౌలు చెల్లించాలని నినాదాలు చేశారు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి కరువై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం సీపీఎం నాయకులు ఎం.రవి, ఎం.భాగ్యరాజు, పేరం బాబురావు, అసైన్డ్ రైతులు గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అసైన్డ్ రైతుల కౌలు విషయమై అనేక సార్లు సీఆర్‌డీఏ కమిషనర్‌ను కలిసి విన్నవించామన్నారు. మూడేళ్లుగా కౌలు అందక అసైన్డ్ రైతులు ఆందోళనగా ఉన్నారని అదనపు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాజధానిలో మొత్తం 3,139 మంది అసైన్డ్ రైతుల్లో 50 శాతం రైతులకు కౌలు చెల్లింపు నిమిత్తం రూ.22 కోట్ల బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. వారం రోజుల్లో కౌలు సొమ్ము అసైన్డ్ రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. మొత్తం మూడేళ్ల కౌలును ఒకేసారి చెల్లించడం జరుగుతుందన్నారు. బిల్లుల ఆమోదం తెలిపే అంశంపై ఆర్థిక శాఖ అధికారులతో సీఆర్‌డీఏ కమిషనర్ మాట్లాడారని, వివరాలు సక్రమంగా ఉన్న అసైన్డ్ భూములకు కౌలు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. మిగిలిన భూముల వివరాలను కలెక్టర్‌కు పంపుతామని, వారి సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ జానీ, కుంభా వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, అమరావతి దళిత బహుజన జేఏసీ నాయకులు చిలకా బసవయ్య, మేరిగ నాగేశ్వరరావు, అసైన్డ్ రైతులు లాం ప్రసాద్, మేరిగ రాజా, నేలపాటి పాపమ్మ, కంతేటి నాగేంద్రం, బేతు బెనర్జీ, మేరిగ శౌరి పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ అజెండా భుజానమోస్తున్న పవన్‌కల్యాణ్: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సనాతనధర్మం పేరుతో పక్కా ఆర్ఎస్ఎస్ అజెండాను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మోస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సనాతనధర్మ పరిరక్షణ పేరుతో లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. వివిధ దీక్షలు చేపడుతూ... సనాతనధర్మ పరిరక్షణకు తాను నడుంకట్టినట్లు, సనాతనధర్మ పరిరక్షణకు చట్టం తేవాలని వ్యాఖ్యానించడం ప్రజలను గందరగోళ పరిచిందని పేర్కొన్నారు. సనాతనధర్మాన్ని దూషించేవారికి, ద్వేషించేవారికి భారతదేశ చట్టాలు, న్యాయవ్యవస్థలు రక్షణ కల్పిస్తాయని పవన్ చెప్పడం కోర్టులను ధిక్కరించడమే అని అన్నారు. సనాతనధర్మం పేరుతో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని చెప్పారు. గతంలో కుల, మత, ప్రాంతీయ అసమానతలు లేని నవ సమాజమే తన ధ్యేయమంటూ గొప్పలు చెప్పిన పవన్ కల్యాణ్... అధికారం చేపట్టాక లౌకిక భావాలను విస్మరిస్తున్నారని తెలిపారు. సనాతనవాదం పేరుతో కేవలం ఆర్ఎస్ఎస్ అజెండాను భుజానమోయడాన్ని తీవ్రంగా ఖండించారు. తన వైఖరి మార్చుకుని, లౌకికవాదిగానే కొనసాగాలని హితవు పలికారు. జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ స్పందించి, పవన్ కల్యాణ్‌కు లౌకిక భావాలను గుర్తుచేయాలని కోరారు.

ఇసుక అధిక ధరకు విక్రయిస్తే కేసులు

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధిక ధరకు ఇసుక విక్రయించే వారిపై కేసులు పెట్టాలని అధికారులను మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. ఏపీఎండీసీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల డీఎంజీలతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇసుక లభ్యత, తవ్వకాలకు అనుమతులపై కీలక ఆదేశాలు జారీజేశారు. జిల్లాలవారీగా అందుబాటులో ఉన్న రీచులు, ఇసుకపై ఆరా తీశారు. ఉచితంగా ఇసుక ప్రజలకు అందించాలని, ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక దొరకడం లేదన్న సమస్యను అధిగమించేందుకుగాను మైనింగ్ అధికారులు సమాయత్తం కావాలన్నారు. జలవనరులశాఖ అధ్వర్యంలో డిసిల్టేషన్ ప్రక్రియతో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకున్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలింపు విషయంలో కఠినంగా వ్యవహరించాలని, స్టాక్‌యార్డు నుంచి వెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ అనివార్యమని మంత్రి ఆదేశించారు. పట్టా భూముల్లో తవ్వకాలకు త్వరగా అనుమతులిచ్చి ఇసుక లభ్యత పెంచాలన్నారు.

ఇటీవల సంభవించిన వరదల్లో బాధితులైన విశాలాంధ్ర సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి సతీమణి అరుణ

7 నుంచి కేజీబీవీ ఉద్యోగాలకు దరఖాస్తులు

సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ (ఏపీ ఎస్ఎస్ఏ), పాఠశాల విద్యాశాఖ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో ఖాళీగా ఉన్న 729 బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బంది పోస్టులను పొరుగుసేవల (అవుట్ సోర్సింగ్) ప్రాతిపదికన భర్తీకి ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసూ... 2024-25 విద్యా సంవత్సరం (ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయడానికి అర్హులయిన ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆఫ్‌లైన్ ద్వారా అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టైప్ 3 కేజీబీవీల్లో 547 పోస్టులకుగాను హెడ్ కుక్ 48, అసిస్టెంట్ కుక్ 263, డే నైట్ వాచ్ ఉమెన్ 95, స్కావెంజర్ 79, స్వీపర్ 62 ఖాళీలు ఉన్నాయని వివరించారు. టైప్ 4 కేజీబీవీల్లో 182 పోస్టులకుగాను హెడ్ కుక్ 48, అసిస్టెంట్ కుక్ 76, చౌకీదార్ 58 పోస్టులు భర్తీ చేయనున్నారని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో ఉన్న ఖాళీల వివరాలను ఈనెల 7వ తేదీన పత్రికా ముఖంగా నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. 7వ తేదీ నుంచి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మండలాల వారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా తయారీని 16న వెల్లడిస్తామని పేర్కొన్నారు. 17న సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పిస్తామని, 18న జిల్లా స్థాయిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తామని వివరించారు. 21న ఆమోదం కోసం జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ముందు ఉంచుతామని, 22న చైర్మన్‌కు ఎంపిక జాబితాను అందజేస్తారు. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు 22వ తేదీన విధులకు హాజరయ్యేలా ఉత్తర్వులిచ్చారు.

24 చోట్ల ఈడీ సోదాలు

న్యూదిల్లీ: పంజాబ్, బెంగాల్‌కు చెందిన చిట్ ఫండ్ సంస్థలో కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ చేపట్టింది. అనుమానితులకు సంబంధించిన ఆస్తులను శుక్రవారం సోదా చేసింది. కోల్‌కతా, పంజాబ్, దిల్లీ, ముంబైలోని 24 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మనీలాండరింగ్‌తో ముడిపడ్డ చిట్ ఫండ్ కేసుతో సంబంధమున్న వారి ఆస్తుల సోదా ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మదుపర్ల డబ్బును మెచ్యూరిటీ తర్వాత తిరిగి చెల్లించకుండా, ఆ డబ్బును స్వప్రయోజాల కోసం చిట్ ఫండ్ సంస్థ దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

రావులపల్లి, మరో 16 మందిపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర-విజయవాడ: మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలకు ఇబ్బంది కలిగించే జీవో 270 రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో ఆందోళన చేస్తున్న నాయకులపై పోలీసులు బనాయించిన తప్పుడు కేసును విజయవాడ మూడవ మెట్రోపాలిటన్ కోర్టు కొట్టివేసింది. 2018 నవంబర్‌లో విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆందోళన జరిగింది. పోలీసులు నాయకులపై కేసు బనాయించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబురావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలారి వీరి... మరో పదహారు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరు సంవత్సరాలు కోర్టు చుట్టూ తిరిగిన నాయకులు కేసు కొట్టి వేయడంతో న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సంఘాల నేతల తరపున సీనియర్ న్యాయవాదులు సంపత్ శ్రీనివాస్, సాయిరాం కేసును వాదించారు.

ఆదేశాలు ధిక్కరిస్తే జైలుకే: సుప్రీం

న్యూదిల్లీ: గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయం సమీపంలోని తొమ్మిది మతపరమైన కట్టడాలను అధికారులు కూల్చివేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. బుల్డోజర్లపై నిషేధం విధిస్తూ అక్టోబరు ఒకటో తేదీన ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులను జైలుకు పంపుతామని స్పష్టం చేసింది. అంతేకాకుండా కూల్చిన కట్టడాలు అన్నింటిని తిరిగి నిర్మించాలని కూడా ఆదేశిస్తామని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తేల్చిచెప్పింది. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణను కోరింది. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

శాప్ చైర్మన్ రవినాయుడు బాధ్యతల స్వీకరణ

భారీ ర్యాలీగా కార్యాలయానికి : ఇందిరాగాంధీ స్టేడియంలో అభినందన సభ

శాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రవినాయుడు శుక్రవారం విశాలాంధ్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చిత్రంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు శివారెడ్డి, ఉదయ్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్‌గా నియమితులైన అనిమిని రవినాయుడు శుక్రవారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గం, తాడేపల్లి మండలం, కొలనుకొండలోని క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన రవినాయుడుకు విజయవాడలోని బెంజి సర్కిల్ వద్ద యువగళం బృంద సభ్యులు, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత విభాగాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. అనంతరం బైక్ ర్యాలీతో రవినాయుడు శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనకు అధికార బృందం స్వాగతం పలికింది. వేద మంత్రాల నడుమ చైర్మన్ కార్యాలయంలోకి ప్రవేశించిన రవినాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. ఆపై శాప్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, శాప్ ఎండీ గిరీషా హాజరయ్యారు. బాధ్యతల స్వీకరణ తర్వాత కొన్ని ఫైళ్లపై రవినాయుడు సంతకాలు చేశారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మంచౌదరి అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్నారు. సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ తెలుగుయువతలో పనిచేసిన రావినారాయణకు శాప్ చైర్మన్ పదవి రావడం అభినందనీయన్నారు. లోకేశ్ పాదయాత్ర పూర్తయ్యే వరకు అనేక ఇబ్బందులు ఎదురైనా ఆయన తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, గద్దె రామ్మోహన్, భాష్యం ప్రవీణ్, పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్ బాబు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ కృష్ణాజిల్లా జెడ్పీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టీడీపీ నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, గురజాల మాల్యాద్రి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సీడాప్ చైర్మన్ జి.దీపక్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నారా భువనమ్మలకు రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తెలుగుదేశంపార్టీలోనే ఉన్నట్లు చెప్పారు. తనకు మద్దతుగా నిలిచిన టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత జిల్లా, రాష్ట్ర విభాగాలన్నింటికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. శాప్ ఆధ్వర్యంలో ఉన్న ఆటస్థలాలు, ఇతర స్థలాలు అన్నింటినీ పరిశీలిస్తానని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. శాప్ మొత్తాన్ని ప్రక్షాళన చేసి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చేస్తానని తెలిపారు.

అసోంలో రహదారుల నిర్వహణ ఆదర్శం

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అసోంలో రహదారుల ఆస్తుల నిర్వహణ విధానం విజయవంతంగా అమలవుతోందని, అత్యాధునిక పరికరాలతో రోడ్ల వివరాలను సేకరిస్తున్న తీరు ఆదర్శవంతంగా ఉందని ఏపీ రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇటువంటి అత్యాధునిక విధానాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అధికారులకు సూచించారు. రహదారుల ఆస్తుల నిర్వహణ విధానంపై సమగ్ర అధ్యయనం కోసం మంత్రి జనార్దన అధ్వర్యంలో అసోంలో రెండు రోజుల పాటు సాగిన పర్యటన శుక్రవారం ముగిసింది. రాష్ట్ర ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం అసోంలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అధ్వానమైన రోడ్లతో ప్రజలు అనునిత్యం పడిన అవస్థలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన రోడ్ల ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రోడ్ల నిర్మాణం, నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో అధునాతనమైన విధానాలను అవలంభించాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికలు రచిస్తోంది. దేశ వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, అభివృద్ధిలో అమలవుతున్న సరికొత్త విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు సమగ్ర అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే గుజరాత్‌లో పర్యటించిన బృందం తాజాగా అసోంలో పర్యటించింది. రెండు దశాబ్దాలుగా రహదారుల నిర్మాణంలో సాధించిన పురోగతిని బృందం తెలుసుకుంది. అసోంమాల పథకం కింద ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక రోడ్డును పరిశీలించింది. ఆస్ట్రేలియాలో తయారైన హాక్ ఐ వెహికల్, అమెరికాకు చెందిన పాత్ రన్నర్ వెహికల్ రెండింటినీ పరిశీలించారు. బృందం రాష్ట్రానికి తిరుగుపయనమైంది. మంత్రితో పాటు ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయిముల్లా, విశ్రాంత స్పెషల్ సీఎస్ శ్యామ్ బాబు, ఏపీఎస్‌హెచ్ ఆర్డీసీ ఛీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.